# శత్రువు

(నాటకం)



డి. విజయభాస్కర్

# శత్రువు

## (నాటకం)

# శత్రువు

(నాటకం)

## పాత్రలు

1. డాక్టర్ అప్పాజీ
2. మార్కండేయులు
3. చిరంజీవులు
4. డాక్టర్ కోటి
5. సుందర రావు
6. డాక్టర్ ప్రసాదరావు
7. మూర్తి
8. కవికాకి
9. కవికాకి అసిస్టెంట్
10. రౌడీలు
11. పేషంట్స్ -2
12. స్థూలకాయుడు

# శత్రువు

## నాటకం

రంగస్థలం ఒక వాకింగ్ ట్రాక్.

తెర తొలగింది. అప్పుడే సూర్యోదయం అవుతుంది. సన్నని వెలుగుతెర పరిసరాలతో, మనుషుల నడకలతో పార్కంతా సందడి సందడిగా వుంది.

వాకింగ్ ట్రాక్ ఈ మూలనుండి ఆ మూలకు స్పష్టంగా కనిపిస్తోంది. ట్రాక్ వెనకా అక్కడక్కడా సిమెంటు బెంచీలున్నాయి. మార్నింగ్ వాక్ కోసం ఒక్కరొక్కరిగా వస్తున్నారు.

ఓ కవి వాకింగ్ చేస్తూ కవితా ధారకోసం ప్రయత్నిస్తున్నాడు. వెనకున్న అసిస్టెంట్, అతని నోటి నుండి ఎప్పుడే పదం వస్తుందా అని ఎదురుచూస్తున్నాడు అసిస్టెంట్ మెడలో దండగా రకరకాల కూరగాయలు ఉన్నాయి. ట్రాక్‌పై అటు ఇటు తిరుగుతూ చేతులూపుకుంటూ, నెత్తి బాదుకుంటూ కవిత్వం చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు. మరో ప్రక్క నుమడి డాక్టర్ కోటి, అతిని వెనుక ఓ స్థూలకాయుడు వస్తున్నారు.

నడవాలి .... ఇంకా స్పీడుగా. స్థూలకాయుడు వెనబడిపోయాడు.

**డాక్టర్** : మరీ పెళ్ళడుగు లేస్తే కుదరదు. బ్రిస్క్ బ్రిస్క్‌గా నడవాలి.

(అంటూ ముందుకి నడిచాడు. స్థూలకాయుడు ఇంకా వెనకబడి పోయాడు. అది చూసి డాక్టర్ వెనక్కి వచ్చాడు) నడవండి! స్పీడ్‌గా నడవండి!

**స్థూ.కా** : (ఆయాసపడ్తూ) అలాగే సార్! ఇలా ఎన్నాళ్ళు పరిగెత్తాలి సార్.

**డాక్టర్** : ఒంట్లోని కొవ్వు కరిగే దాకా!

**స్థూ.కా** : కరుగుతుందంటారా?

**డాక్టర్** : ఈ తాబేలు నడకలకు కరగదు. పరిగెత్తండి...ఇలా ఇలా రన్ అప్.....

**స్థూ.కా** : (ఆపసోపాలు పడుతూ పరుగెడ్తున్నాడు. ఇంకా పరుగెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు) (ఇంకో పక్క నుండి డాక్టర్ ప్రసాద్ రావు మూర్తి మాట్లాడుకుంటూ వస్తున్నారు)

| | | |
|---|---|---|
| డా॥ ప్ర. | : | మూర్తిగారు ఈ మధ్య సినిమాల్లో సెక్స్ వయొలెన్స్ మితి మీరిపోతుంది. ఫ్యామిలితో సినిమా చూడాలంటే సిగ్గు వేస్తుంది. అవును చిరంజీవిగారేరి? ఎప్పుడూ లేటుగా రారే! |
| మూర్తి | : | అవును సార్ ఆయన చాలా పంక్చువల్ ఎట్టి పరిస్థితులలోను మాట తప్పడు, టైమ్ తప్పడు, మరి ఈ రోజు లేట్. అదిగో మాటల్లోనే వచ్చేసారు. |
| చిరంజీవి | : | సారీ డాక్టర్ గారు అయామ్ లేట్. ఏం జరిగిందంటే నా బూట్ లేసు మా పప్పీ అదేనండీ మా కుక్కపిల్ల తీసుకెళ్ళి మంచం క్రింద పడేసింది. |
| డాక్టర్ | : | ఈ రోజు కూడా మీ పందెం ఉందా |
| చిరంజీవి | : | వైనాట్ ఉంది. |
| కవి | : | జాగ్రత్తగా వస్తూ ఉన్నావు కదా! |
| అసిస్టెంట్ | : | ఆ చాలా జాగ్రత్తగానే వస్తూ ఉన్నాను సార్ |
| కవి | : | ఇదిగో ఈ ప్రదేశం చాలా బాగుంది |
| అసిస్టెంట్ | : | ఇలా పార్కులో చాలా ప్రదేశాలు బాగున్నాయి అన్నారు. ఆగారు మళ్ళీ బాగలేదన్నారు. అక్కడ రావడం లేదన్నారు. |
| కవి | : | ఈసారి వస్తుంది. పలికిందా ....... పొలికాందనుకో! |
| అసిస్టెంట్ | : | పొలికిందా గిలికాననుకోండి. |
| కవి | : | గుడ్! గుడ్! (మళ్ళీ ప్రయత్నిస్తున్నాడు) ఇలా ఇవ్వు. |
| అసిస్టెంట్ | : | (తన చేతిలోని పెన్ను, పుస్తకం కవిచేతిలో పెట్టాడు) |
| కవి | : | ఇవి కాదు.....అవి |
| అసిస్టెంట్ | : | (మెడలోని కారెట్లు, దోసకాయలు కవిచేతికిచ్చి) రాత కన్నా మేత ఎక్కువైపోతుంది. |
| కవి | : | నేనేమి తెలివి తక్కువ వాడ్నయి ఇవి తినడం లేదు. సరళమైన కవిత్వం రాయాలంటే ప్రకృతిలోకి చొచ్చుకుపోవాలని ఈ కూరగాయలు తింటున్నాను. |
| అసిస్టెంట్ | : | కూరగాయలు తింటే కవిత్వం వస్తాదేటండీ! |
| కవి | : | నీకేం తెలుసురా! ఏమేత మేస్తే ఆ కూత కూస్తాం. నేను కవికాకిని నిద్రపోతున్న జనాన్ని మేల్కొలిపే కవికాకిని.....కా! కా!..... |

సాత్వికమైన కవిత్వం రావాలంటే సాత్వికాహారం తినాల్సిందే! ఆ! వస్తోంది....ఆగు .... కాస్తా ఆగు.

**అసిస్టెంట్** : వదలండిసార్.... వొలికించండిసార్

**కవి** : ఊహూ! మధ్యలో అడ్డుతుందయ్యా (కూరగాయలు పరాపరా నమిలాడు)

**అసిస్టెంట్** : ఇంకా కొంచెం కష్టపడండి వచ్చేస్తాది.

**కవి** : పడుతున్నాను పడుతున్నాను

**అసిస్టెంట్** : మరికాస్తా... మరికాస్తా.... అయిపోతాది

**కవి** : చుప్ ఇదేమన్నా మోషనా అయిపోవడానికి ఎమోషన్‌య్యా ఎమోషన్! ఉష్....ఈ లొకేషన్ నన్ను ఇన్‌స్పైర్ చెయ్యలేక పోతోంది. మరో చోటుకి పోదాం పద! (వాకింగ్ చేసుకుంటూ వెళ్ళిపోయాడు)

**అసిస్టెంట్** : ఇలాంటోడే ఏదో చెయ్యలేక ఏదో వంకన్నాడట. ఒక పద్యం రాయడానికి ఆర్నెల్లు + సిటీలోని లోకేషన్స్ అన్నీ + నా జీవితం ఖర్చవుతున్నాయి గాని ఆయనికి మాత్రం కొంచెం కూడా రావడం లేదు కవిత్వం.

**మార్కండేయులు** : చిరంజీవి గాడు ఈ పార్క్‌కి వస్తున్నాడంటావా!

**అసిస్టెంట్** : అవును సార్ మొన్న నేను ఇటుప్రక్క నుంచి వెల్తుంటే ఈ పార్కు గేటు నుంచి బయటికి రావడం చూసాను.

**మార్కండేయులు** : ఇంత తెల్లారే వస్తాడంటావా

**అసిస్టెంట్** : తప్పకుండా సార్ ఇదే టైమ్‌లో నేను చూసా ఇంకో అరగంటపోతే గాని జనం పూర్తిగారారు ఈ లోగా మనపని కానిచ్చేద్దాం!

**మార్కండేయులు** : అయితే నువ్వు గేటు దగ్గరుండు నీకు కనిపిస్తే ఏదో మాటల్లోపెట్టి ఆపు ఈ లోపల పార్కులోపల ఉన్నాడేమో మేం చూస్తాం (2వ వాడి కత్తి క్రింద పడింది.) ఒరేయ్

**రెండవ వ్యక్తి** : జారిపోయింది సార్

**మార్కండేయులు** : జాగ్రత్త, వెళ్ళు

**కోటి** : (వస్తూ) రావాలి, రావాలి, స్పీడ్‌గా రావాలి రకరకాల చెట్లను వాసనలు పీలుస్తూ రోజు ఇలా పరుగెడితే మన ఆరోగ్యం బాగుంటుంది మన ఆయుస్సు పెరుగుతుంది. నాది ప్రకృతి వైద్యం. నాకు ప్రకృతే దైవం. (మార్కండేయున్ని చూసి)

**కోటి** : నమస్కారం సార్!

**మార్కండేయులు** : ఆ–బాగున్నావా కోటి, డాక్టర్ అప్పాజీగారితో నువు ప్రకృతి వైద్యం చేస్తున్నావా

**కోటి** : అబ్బే లేదండి, ఇలా ప్రకృతిలో పరిగెత్తడానికి ఈ పార్కు చాలా ప్రకృతి సిద్ధంగా ఉంది. అంటున్నానండి.

(మార్కండేయులు, అసిస్టెంటు వెళ్ళారు, స్థూలకాయుడు వచ్చాడు.)

**స్థూ.కా** : ఎవరు సార్ అతను

**కోటి** : అతను మాజీ ఎం.ఎల్.ఎ. మార్కండేయులు, నీ కన్నా డబుల్ ఉండేవాడు. నా దగ్గర పాఠాలు నేర్చుకొని సగం అయినాడు. రాను రాను నువ్వూ సగం అయిపోతావ్ పరిగెత్తు. (చిరంజీవులు, మూర్తి పందెం వేసుకుని పరిగెట్టుకుంటూ వస్తున్నారు)

**చిరంజీవి** : హమ్మయ్య నేనే ముందొచ్చాను.

**మూర్తి** : నాకు తెలుసు నేను ఓడిపోతానని

**చిరంజీవి** : ఆల్‌వేస్ సక్సెస్ ఈస్ మైన్!

**మూర్తి** : సక్సెస్ నా మీద కొట్టడం కాదు. ఆ మార్కండేయుల మీద కొట్టండి.

**చిరంజీవి** : వాడిమీద కూడా కొట్టి తీరుతాను కొన్నాళ్ళు ఆగు.

**మూర్తి** : ఎప్పుడు కొడతారు. గత రెండేళ్ళలో ఒక్క విషయంలో కూడా అతన్ని మీరు గెలవలేకపోయారు.

**చిరంజీవి** : మూర్తీ గెలుపంటే ఏంటో తెలుసా! అన్నీ మనం దక్కించుకోవడం కాదు – శత్రువుకి ఏదీకూడా దక్కకుండా చేయడం కూడా గెలుపే. నేను అదే చేసాను. అదిగో డాక్టర్ గారు వస్తున్నారు. కాస్సేపు ఊరుకో! (డాక్టర్ ప్రసాదరావు దగ్గర కొచ్చాడు)

**ప్రసాదరావు** : ఎన్ని నిమిషాల్లో చేరారు

**చిరంజీవి** : మూర్తికన్న తొందరగా పరిగెత్తాలనే ధ్యాసలో టైం చూసుకోలేదు డాక్టర్!

**మూర్తి** : మీరు చూడక పోయినా నేను చూసాను సార్!

15 నిమిషాలు పట్టింది. డాక్టర్ గారూ!

**ప్రసాదరావు** : రేపు 13 నిమిషాల్లో రావాలి..... ఇలా రోజుకు రెండు నిమిషాలు తగ్గించుకుంటూ... ఈ చెట్టు దగ్గరకు, 7, 8 నిమిషాల్లో రీచ్

అయ్యారనుకోండి హెల్త్ ఫర్‌ఫెక్ట్‌గా ఉన్నట్లు లెక్క... చేతులు ఇలా అనండి... ఇలా....ఇలా...

**చిరంజీవి** : (డాక్టర్ చెప్పినట్టు చేస్తున్నాడు)

**ప్రసాదరావు** : కాళ్ళు ఇలా అనండి ఇలా! ఇలా

**చిరంజీవి** : (అలా అంటుండగా కాళ్ళు నొప్పిగా ఫీలయ్యాడు) అమ్మా! కాస్త పెయిన్ వస్తుంది.

**ప్రసాదరావు** : ఫర్వాలేదు గట్టిగా ముందుకి ఊపండి.

**చిరంజీవి** : ముందుకు ఫ్రీగా సాగడం లేదు డాక్టర్ గారూ.

**మూర్తి** : (కాస్త గోప్యంగా) ఎదురుగా మార్కండేయుల్ని ఊహించుకోండి. అతన్ని తంతున్నట్టు భావించుకోండి. మీ కాళ్ళు వామనుడి కాలు లాగా సాగుతాయి.

**చిరంజీవి** : నోర్మూయ్ డాక్టర్ వినగలడు.

**ప్రసాదరావు** : షుగర్ ఉన్నప్పుడు ఆర్థరైటీస్ కామన్‌గా వస్తాది.

**చిరంజీవి** : ఏ డిసీజ్ అయినా రావచ్చుగానీ డాక్టర్! ఈ షుగర్ మాత్రం పగవాడిక్కూడా రాకూడదండి.

**ప్రసాద్‌రావు** : నిజానికి షుగర్ డిసీజ్ కాదు. డిజార్డర్ అనటం కరక్టు. మెయిన్‌గా టెన్షన్ ఉండకూడదు.

**మూర్తి** : అబ్బో మాసార్ అన్నిటికీ భలే టెన్షన్ పడిపోతుంటారు.

**ప్రసాదరావు** : జీవితంలో ఏదెలా జరగాలో అలాగే జరుగుతుంది. దానికి టెన్షన్ ఎందుకండి

**మూర్తి** : నన్ను చూడండి సార్ ఏ టెన్షన్ లేకుండా ఎలా ఉంటానో డాక్టర్ గారూ. మీకు చెప్పడానికి భయమేంటి? నేను ఉద్యోగంలో ఉండగా ఎన్నో ఇర్రెగ్యులరిటీస్ చేసాను. అయినా ఎప్పుడు పిసరంత టెన్షన్ పడ్లేదు.

**ప్రసాదరావు** : అన్ని తప్పులు చేసికూడా టెన్షన్ లేకుండా ఎలా ఉన్నారండి బాబు!

**చిరంజీవి** : రూల్సుని భలే గమ్మత్తుగా వయిలెట్ చేసేవాడులెండి.

**ప్రసాదరావు** : గమ్మత్తుగా చేసేవాడ్నా? రూల్స్ వయిలేట్ చేస్తే అసలు రూలెందుకండీ

**మూర్తి** : వయిలెట్ చెయ్యకపోతే ఇక మనమెందుకండీ! అసలు నేనేమి చేసే వాడ్నో తెల్సాండీ! నా కింద వాళ్ళు ఎన్నో రూల్సు కోట్ చేసి, ఆపని

చెయ్యొద్దనో, చెయ్యొచ్చునో రాసిపెట్టేవాళ్ళు మనది ఒకటే రోడ్డు కొట్టుడు – అన్ని ఫైళ్ళకి ఇన్ వ్యూ ఆఫ్ ది ఎబౌ, నాట్ అప్రూవుడ్ అని గీసిపడేసేవాడ్ని, మనది మనకి ముట్టిపోయిన తర్వాత నాట్ కి ఇ తగిలించి నోట్ అప్రూవుడ్ అనే వాడ్ని. ఫైళ్ళు కిందికి మీదికి తిరక్కుండ సబ్ మిషన్ రీ సబ్‌మిషన్స్ లేకుండా, టేంపరింగులు అనిపించుకోకుండా నడిపేసే వాడ్ని – అందుకే ఇంగ్లీష్‌లో ఇ అనే అక్షరం అంటే నాకు చాలా ఇష్టం – ఇ అంటే ఎనర్జీ ఇ అంటే ఎకనామి ఇ అంటే.

**ప్రసాదరావు** : ఎర్రర్ కూడా – దాని ఫలితం ఎప్పుడో ఒకప్పుడు అనుభవించాల్సి వస్తుంది.

**మూర్తి** : నేనది నమ్మను డాక్టర్‌గారు! ఇప్పుడు ట్రీట్‌మెంట్ చేస్తున్న వారిలో, బాధలను అనుభవిస్తున్న వారిలో 50% అమాయకులే డాక్టర్‌గారూ! పాపభీతి, నీతి, ఇవన్నీ చేతకాని వాడు చెప్పే మాటలు డాక్టర్ గారు. మీరు ఓ ఫేమస్ డాక్టర్. మీకు తెలియనిదేముంది. ఒక్కోడు రాళ్ళు తిని రాళ్ళు అరిగించేసుకుంటాడు. మరొకడు పాపం మంచినీళ్ళు తాగి విరేచనాలు చేసుకుంటాడు. నీతి, న్యాయం, రూల్సు ఇవన్నీ పాటించేవాడికే పాటించని వాడికి ఏమీలేదు.

**ప్రసాదరావు** : నేను గవర్నమెంటులోనే కాదు ఎక్కడైనా స్ట్రిక్ట్‌గా ఉన్నప్పుడు ఆ సాటిస్‌ఫై వేరేగా ఉంటుంది.

**మూర్తి** : నేనైతే అతను చెప్పిన ఒక్క వెధవపని కళ్ళు మూసుకొని చేసేసి, వాడి చేతనే నాలుగు వెధన్నర పన్లు చేయించుకునే వాడ్ని. ముక్కు సూటి పోతశ్వరుడుకదా! ఫలానారూలు ప్రకారం మీరు చెప్పిన పని చెయ్యలేమన్నాడు. దాంతో వాడికి ఎక్కడ కాలాలో అక్కడ కాలింది. భాంచాత్ నేను చెప్పిన పని చెయ్యవా అని అటు ఎ.సి.బి. వాళ్ళను, ఇటు ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ళను గిల్లాడు. దాంతో ఆఫీస్ మీద, ఇంటిమీద రెయిడింగ్‌లు చేసారు.

**ప్రసాదరావు** : ఏమైనా దొరికిందా!

**మూర్తి** : ఉంటేగా దొరకడానికి!

**ప్రసాదరావు** : ఇక అతన్ని ఎవరేం చెయ్యలేరు.

**మూర్తి** : దొరక్కుండా ఉంటుందా ఆ మార్కండేయులు ఎలాంటి వాడంటే కోతికి ఎక్కువ చింపాంజీకి తక్కువ, చిరంజీవిగారి పేరు మీద

లక్షరూపాయల బాండ్ కొని సరిగ్గా రైడింగ్ జరుగుతున్న సమయంలో ఒక కుర్రాడితో సార్ ఇంటికి పంపాడు. ఇంకేం ఉంది. అది ఎక్కడదని అడిగితే సమాధానం చెప్పలేకపోయారు.....

**చిరంజీవి** : సరిసరే నా సంగతి ఇప్పుడెందుకు గాని డాక్టర్ అప్పాజీగారి స్పీచ్ మొదలవుతున్నట్లుంది. పదండి వెళ్దాం.

**మూర్తి** : సరే

**ప్రసాదరావు** : అదేమిటి మూర్తిగారు ఈ రోజు వాకింగ్ అయిన తరువాత ఇ.యన్.టి.కి వచ్చి బ్లడ్ టెస్ట్ చేయించుకుంటానన్నారు.

**మూర్తి** : అవునవును. సార్ మేం హాస్పటల్‌కి వెళ్తాం మీరు వెళ్ళండి.

**చిరంజీవి** : ఒ.కే.

**డా॥ కోటి** : అదీ అలాగే ఆ బాడీ మొత్తం ఇలా షేక్ అవ్వని ఇంకాస్త

**స్థూ.కా** : ఇక నావల్ల కాదండి.

**డా॥ కోటి** : నీ జబ్బు తగ్గించడం కూడా నావల్లకాదు

**స్థూ.కా.** : అమ్మో! మీరు చంపినా నేనొక్క ఇంచికూడా కదల్లేనండి బాబు!

**డా॥ కోటి** : కదలకపోతే నిజంగానే చస్తావ్.

**స్థూ.కా** : అమ్మో. నేను బతకాలిసార్. బతకాలి

**డా॥ కోటి** : బతకాలంటే పరిగెత్తాలి. ఆగాడు. (జేబులోంచి టేప్ తీసి పొట్ట చుట్టుకొలత తీయడానికి తిప్పలు పడుతూ) మంధర పర్వతానికి ఆది శేషుడ్ని చుట్టినట్టుంది. నాదో డౌటు. మీ పొట్ట కింద భాగం చూస్కుని ఎన్ని సంవత్సరాలయి ఉంటుంది. – అదే కాళ్ళను...

**స్థూ.కా** : ఏమో గుర్తులేద్సార్!

**డాక్టర్ కోటి** : మరదే... ఓ వారం రోజులు ఉదయం సాయంత్రం ఈ పార్కులో ఓ పదిరౌండ్లు బ్రిస్క్‌గా జాగింగ్ చేస్తే....

**స్థూ.కా** : అమితాబ్ బచ్చన్ అయిపోతానా? (సుందర్‌రావు వస్తూ అతని మాటలు విని)

**సుందర్‌రావు** : అమితాబే ఖర్మ... అభిషేక్ బచ్చన్‌వై పోతావ్ మోహం చూడు.

**డాక్టర్ కోటి** : మీ బాడీ మామూలుగా లేదండి గోల్కొండ ఫోర్ట్‌లా వుంది. గర్భం హుస్సేన్ సాగర్ చెఱువు గర్భానికి తీసిపోదు. ఒంట్లోని నరాలు సిటీలో అడుగడుగునా కనబడే నాళాళ్ళా ఉన్నాయ్. వాటిలో వున్న పూడికలా కొవ్వు పేరుకుపోయింది. ఇక గుండె పరిస్థితి చెప్పలేం.

స్థా.కా : ఎలా ఉందంటారు?

సుందర్‌రావు : హైదరాబాద్ మహానగరానికి నీరు అందించలేని మెట్రో వాటర్ బోర్డులా ఉంది.

స్థా.కా. : ... హమ్మో! నిజమా

డాక్టర్ కోటి : ఆ...... మరి....... అందుకే నేను చెప్పినట్టు జాగింగ్ చేయండి. ఫుడ్ విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి.

స్థా.కా : ఏం తినమంటారు సార్

డాక్టర్ కోటి : ఉదయాన్నే లేస్తూ... ఒక గ్లాసుడు మంచి నీళ్ళలో ఓ నిమ్మకాయ పిండుకొని తాగండి.

స్థా.కా : తాగుతా....

డాక్టర్ కోటి : మధ్యాహ్నం ఓ చపాతీ... ఓ కప్పు అన్నం... పచ్చికూరగాయలు

స్థా.కా. : పచ్చివాండీ?

డాక్టర్ కోటి : అవును... వండకూడదు... ఏం తిన్నా పచ్చివే...

స్థా.కా. : మరి రాత్రికి

సుందర్‌రావు : మధ్యాహ్నం తింటారే... దాంట్లో సగం తినాలి.

స్థా.కా : అమ్మో ఇలా పరిగెత్తి అలా తింటే పొట్ట తగ్గిపోతదాండీ...?

డాక్టర్ కోటి : డెఫినెట్‌గా పదంగుళాలు తగ్గుతుంది.

స్థా.కా : అలాగైతే మీరు చెప్పినట్టే చేస్తానాన్సర్.

డాక్టర్ కోటి : గుడ్..... గుడ్.... వారం తరువాత మళ్ళీ వచ్చే ఆదివారం ఇక్కడే కలుద్దాం...

స్థా.కా : అలాగే సార్

డాక్టర్ కోటి : నాది ప్రకృతి వైద్యం - నాకు ప్రకృతే దైవం. (అంటూ జాగింగ్ చేసుకుంటూ వెళ్ళాడు)

సుందర్‌రావు : ఏంటీ ప్రకృతి వైద్యం పేరుతో డాక్టర్ అప్పాజీ గారికి కాపీ కొడుతున్నావా?

డాక్టర్ కోటి : నువు నా దగ్గర కాంపౌండర్‌విరా నా పాలిట సి.ఐ.డి.వికాదు. ఆ విషయం మర్చిపోకు.

సుందర్‌రావు : నేను నీ బామ్మర్దిని. ఆ విషయం నువ్వు మర్చిపోకు.

డాక్టర్ కోటి : బావ చేసిన ప్రతీదాన్ని విమర్శించినోడు బామ్మర్ది ఎలాగౌతాడు.

**సుందర్‌రావు** : ఆహా సరే ఇద్దరం అప్పాజీ దగ్గరకెళ్దాం పద – ఆయనే చెబుతాడు నేనెలా బామ్మర్ధినౌతానో.

**డాక్టర్ కోటి** : అంటే నేను పార్ట్ టైమ్ ప్రకృతి వైద్యం చేస్తున్నట్టు అతని దగ్గర ఊదుతావా!

**సుందర్‌రావు** : ఊదే అలవాటు, చీదే అలవాటు నీది.

**డాక్టర్ కోటి** : థాంక్స్

**సుందర్‌రావు** : అదిగో అప్పాజీ గారు అక్కడ లెక్చర్ ఇస్తున్నారు. పోయి విను – కొంత జ్ఞానమైనా వస్తాది.

**డాక్టర్ కోటి** : ఒరేయ్ ఆ హాస్పిటల్ కట్టడానికి లక్షలకు లక్షలు.. అప్పు జేసా్రా!. (ఒక ప్రక్క డా॥ అప్పాజీ ఎత్తుగా ఓ చెట్టు చుట్టూ ఉన్న చప్టామీద నిలబడి అక్కడకొచ్చిన వాళ్ళకు ఉపన్యాసం వినిపిస్తున్నారు.)

**అప్పాజీ** : మన ఆరోగ్యం, ఆయుష్షు, ఆనందం ఇవన్నీ మన ఆహారం నియమాల పైనే ఆధారపడి ఉంటాయి. మన శరీరంలోనూ ఒక అలారం ఉంటుంది. అయితే అలారం పెట్టే గోడును వినిపించుకోం. శరీరం ఇచ్చే సంకేతాన్ని పట్టించుకోం. భోజనం చేస్తుండగా తేన్పు వస్తుంది. దానర్థం ఏమిటి తిన్నది చాలు ఇంకా తినొద్దని. కాని ఆపం, తినేస్తుంటాం. అలాగే ఆవలింత వస్తుంది. అంటే చాలా అలసిపోయావు ఇంక నిద్రపో అని చెబుతుంది. కాని వినిపించుకోం. రాత్రంతా సినిమాలు, టి.వి.లు చూస్తూ కూర్చుంటాం. ఇలా ఎన్నో భగవంతుడు మనకోసమని ప్రకృతిలో సృజించాడు మనకు ఉపయోగపడేవి. మనకి జాగ్రత్తలు చెప్పేవి, మనల్ని సన్మార్గంలో నడిపించేవి. కాని ఆ నడకను మనం మర్చిపోయాం. కొత్త కొత్త మోజులకు పోయి అడ్డదారిలో ముళ్ళపొదలను దాటాలని ప్రయత్నించి అదే ముళ్ళ పొదల మీద పడుతున్నాం కనుక ఇకనైనా మనిషిగా నడవడానికి ప్రయత్నించండి.

(డాక్టర్ అప్పాజీ తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తున్నారు. ట్రాక్ మీదకు మార్కండేయులు మళ్ళీ రౌండ్ వాక్ చేసుకుంటూ వచ్చాడు – వెనకున్న అనుచరుడు మార్కండేయులతో మాట్లాడుతున్నాడు.)

**మార్కండేయులు :** ఏడ్రా ఈ పార్కుకు వస్తాదన్నావు ఎక్కడా లేదు

**అనుచరుడు** : నేను ఈ పార్కు దగ్గరే చూసాను సార్. ఒకసారి ఉండండి.

**మార్కండేయులు :** ఎందుకురా (ఇద్దరూ ఓ ప్రక్కకి వచ్చారు)

**అనుచరుడు** : అటు చూడండి! డాక్టర్ అప్పాజీ గారి చుట్టూ ఉన్న జనాల్లో చిరంజీవులుగారున్నారు.

**మార్కండేయులు** : ఎక్కడరా!

**అనుచరుడు** : అటు చూడండి సరిగ్గా!

**మార్కండేయులు** : ఆడు చిరంజీవులే కదూ!

**అనుచరుడు** : అవున్సార్! ఇదే మంచి అవకాశం సార్, ఏసేద్దామా?

**మార్కండేయులు** : కానీ డాక్టర్ అప్పాజీ ఉన్నారే! ఆయన ఎదురుగా చీమను కూడా చంపలేం. (కోటి, సుందర్‌రావు వస్తూ)

**అనుచరుడు** : అదిగో సార్! క్లాసు కూడా అయిపోయింది. ఎటువాళ్ళు అటు పోతారు. చిరంజీవుల్ని ఈ తుప్పల్లోకి లాక్కొచ్చి ఫినిష్ చేసేద్దాం – ఈ చాన్స్ వదిలేస్తే మళ్ళీ దొరకదుసార్.

**మార్కండేయులు** : కరక్టే! గేటు దగ్గర ఉన్న మనవాళ్ళను పిల్చుకొనిరా! నేను ఇక్కడే ఉంటాను.

**కోటి** : విన్నావుగా సుందరం. డాక్టర్ అప్పాజీ గారు ఈ రోజు హాస్పిటల్‌కి రారట. అంటే ఈ రోజు మొత్తం హాస్పిటల్‌కి ఓనర్ని, నేనే డాక్టర్‌ని, హోల్ అండ్ సోల్ మోనార్కుని, ఈ రోజు నా దగ్గర నీతులు సాగవు. నేను చెప్పినట్లు వినాల్సిందే, నేను నిల్చోమంటే నిల్చోవాలి. కూర్చోమంటే కూర్చోవాలి. అర్థమయిందా.

**సుందర్‌రావు** : నేను ఈ రోజు సెలవు పెడుతున్నాను.

**కోటి** : ఒరే నేను ఒక్కడ్నే అయిపోతానురా. (అనుచరుడు వెళ్ళి మరో ఇద్దరితో వచ్చాడు)

**మార్కండేయులు** : వాడినోరు మూసి ఈ పొదల్లోకి లాక్కురండి... నా చేతుల్తో నేనే పొడుస్తాను.

(అనుచరులు క్లాస్ జరిగిన ప్లేస్ వైపు వెళ్తున్నారు – క్లాసు అయిపోవడంతో ఎవరి వస్తువులు వాళ్ళు సర్దుకొని వెళ్ళిపోతున్నారు. చిరంజీవులు లేచి డాక్టర్ అప్పాజీ కాళ్ళకు మొక్కాడు – డాక్టర్ అప్పాజీ అతనికి షేక్‌హ్యాండ్ ఇచ్చి ఓ ప్రక్కకు తిరగ్గానే మార్కండేయులు అనుచరులు గుంపుగా వెళ్ళి, చిరంజీవుల్ని కార్నర్ చేసి ముందుకు లాక్కొచ్చారు.)

**చిరంజీవులు** : (పెనుగులాడుతూ) డాక్టర్ గారూ!

**మార్కండేయులు :** ఒరేయ్ ఏసెయ్యండిరా వాడ్ని! చంపెయ్యండి! (ఆకేకలకు డాక్టర్ అప్పాజీ పరుగెత్తుకుంటూ వచ్చాడు)

**డాక్టర్ అప్పాజీ :** మార్కండేయులు ఆగు! ఇదిగో వదిలేయ్

**మార్కండేయులు :** డాక్టర్ గారూ నన్నాపకండి ఈ రోజుకోసమే ఎదురుచూస్తున్నాను. వీడ్ని చంపే నేను ఇక్కడ నుండి వెళ్తాను. మీరు సాక్ష్యం ఇస్తే జైలుకైనా వెళ్తానుకాని వీడ్ని ఈ రోజు చంపకుండా ఇక్కడ నుంచి వెళ్ళను.

**డాక్టర్ అప్పాజి :** నేను సాక్ష్యం ఇచ్చినా చంపుతాను అంటున్నావంటే నామీద నీకు గౌరవం లేదనే కదా. అలాంటప్పుడు నన్ను ముందు చంపి తరువాత చిరంజీవులని చంపు.

**మార్కండేయులు :** డాక్టర్ గారు మిమ్మల్ని చంపడమా! హాస్యానికి కూడా అలాంటి మాటలు అనకండి! (చిరంజీవులను చూసి) ఒరేయ్ ఆడంగి వెధవా! డాక్టర్ గారి వెనక దాక్కోవడం కాదు నా ముందుకొచ్చి మగాడ్ని, మొనగాడ్ని అనిపించుకో! నీ తప్పు ఒప్పుకో.

**చిరంజీవులు :** నేనేం తప్పుచెయ్యలేదు. అవి నువ్వు చేసిన పాపాలు ఇప్పుడు నిన్ను శిక్షిస్తున్నాయి.

**మార్కండేయులు :** చూసారా డాక్టర్‌గారు వాడి పొగరుబోతు మాటలు అవి నేను చేసిన పాపాలట. వీడి వలన జరిగిన నష్టాలు ఒకటా, రెండా? ప్రతీ వ్యాపారంలో నాకు పోటీ, ప్రతి విషయంలోనూ, వీడు నాకో సవాలు, ఆఖరికి నా యం.ఎల్.ఎ. నామినేషన్ డిస్క్వాలిఫై అవ్వడానికి కూడా వీడే కారణం. నాకు మనశ్శాంతి కలగాలంటే వీడు చచ్చిపోవాలి. వీడు చచ్చిపోవాలి – వీడ్ని బ్రతకనివ్వను. డాక్టర్ గారూ.

**చిరంజీవి :** నా పరిస్థితి చాలా ఘోరంగా ఉంది డాక్టర్! రేయింబవళ్ళు వాడే నాకళ్ళలో మెదులుతున్నాడు. నన్ను చంపితీరుతానని నా వాళ్ళందరికీ రోజూ ఫోన్ చేసి బెదిరిస్తున్నాడు.. అది విన్న దగ్గరనుండి ఏ రోజు చంపేస్తాడోమోనని నా భార్య, బిడ్డలు మనశ్శాంతి లేకుండా బ్రతుకుతున్నారు. వీడు ఈ భూమ్మీద ఉన్నంతకాలం నాకు మనశ్శాంతి లేదు వీడు ఎప్పుడు చస్తాడా అని అందరిదేవుళ్ళను మొక్కుతున్నాను.

**మార్కండేయులు :** డాక్టర్‌గారూ! చూసారా వీడి నిజస్వరూపం ఇక వాదన వద్దు. మా మధ్య శతృత్వం ఎందుకొచ్చిందో, ఎలా వచ్చిందో ప్రతీ విషయం మీకు తెలుసు. మీరు మా ఇద్దరికీ ఆప్తులు. మీరు చెప్పండి. మాలో తప్పెవరిదో!

**చిరంజీవి** : చెప్పండి డాక్టర్ గారూ! నాది తప్పని ఒక్క మాట చెప్పండి చాలు. నా ముఖాన్ని మళ్ళీ మీకు చూపించను. చెప్పండి డాక్టర్.

**మార్కండేయులు :** చెప్పండిసార్! తప్పెవరిదో!

**అప్పాజీ** : ఏమని చెప్పను మీరు చేసింది ఏమైనా పుణ్యకార్యాలా? వాటిని పదికాలాల పాటు గుండెల్లో దాచుకోవడానికి! గుండెలు తీసే పనులు. వాటిని త్రవ్వుకుంటూ పోతే మిగలే దేముండదు. చూడండి! పగ, ప్రతీకారం, మనుష్యుల్ని మరుగుజ్జుల్ని చేస్తుంది. మంచితనం మానవత్వం మహాత్ముల్ని చేస్తుంది. మనుషులు ఒకర్నొకరు చంపుకోవాలని దేవుడు ఆశించివుండి వుంటే ఈ చెట్లకు పూలు, పండ్లకి బదులు కత్తులు, తుపాకులు కాచేవి. మార్కండేయులూ నా మీద నీకు ఏ మాత్రం గౌరవం ఉన్నా ముందా కత్తి పడేసి ఇక్కడ నుండి వెళ్ళిపో ప్లీజ్.

**మార్కండేయులు :** ఒరేయ్, డాక్టర్‌గారు మీ కుటుంబానికి ఆప్తులైతే నాకు దేవుడురా! అతనిమీద ఉన్న గౌరవంతో నిన్ను చంపకుండా వదిలేస్తున్నాను. ఒకటి గుర్తుపెట్టుకో! డాక్టర్ గారు ఎల్లవేళలా నిన్ను కాపాడలేడు నాకు ఒంటరిగా ఏదో ఒకరోజు దొరుకుతావు అప్పుడు నా చేతిలో చస్తావు ఇది ఖాయం. ఈ రోజు నుంచి నీవు రోజులు లెక్కబెట్టుకో.

## రెండవ భాగం

(స్ట్రెచర్ మీద ఒక పేషంట్‌ని ఒ.పి. ముందు నుండి డ్రెస్సింగ్ రూమ్‌లోకి తీసుకెళ్తున్నారు. కాంపౌండర్ సుందర్రావు వాళ్ళకేవో సూచనలిస్తున్నాడు)

**సుందర్‌రావు** : ఫోన్‌లో "అలాగేసార్ అలాగే" నస్తీషియా డాక్టర్ ఆల్‌రెడీ థియేటర్‌లో ఉన్నారు. అలాగే డా॥ ప్రసాదరావు బయల్దేరారు. అంతారెడీ చేసి పెట్టండి... త్వరగా! (డాక్టర్ కోటి ఇంకోవైపు నుండి వచ్చాడు)

**కోటి** : ఏరా సుందర్రావు! పేషంట్‌కి అన్ని టెస్టులూ చేశార్రా?

**సుందర్‌రావు** : ఆ...ఆ.... చేశారు.

**కోటి** : బ్లడ్ టెస్ట్ చేశారా!

**సుందర్‌రావు** : చేశారు బావా! (వెంటనే సర్దుకుని) చేశారు డాక్టర్ గారూ!

**కోటి** : ఎక్స్‌రే

**సుందర్‌రావు** : తీశారు డాక్టర్ గారు

**కోటి** : హెడ్‌కి సి.టి. స్కాన్, స్టమక్‌కి అల్ ట్రా సౌండ్?

**సుందర్‌రావు** : నీకు బుద్ధుందా? డాక్టర్ గారు కాలికి ఆపరేషన్ చేస్తుంటే హెడ్‌కి స్కాన్, కడుపుకి అల్ట్రాసౌండ్ ఎందుకు?

**కోటి** : ఆ సంగతి నీకు తెల్సు – నాకు తెల్సు – వాళ్ళకేం తెల్సు. వాళ్ళకున్న కంగారులో ఏ టెస్టంటే అది చేయించుకుంటారు – ఎంతంటే అంతిస్తారు – ఇదిగో ఈ టెస్టులన్నీ చేయించందే ఆపరేషన్ చేయించుకోవడానికి వీల్లేదంతే?

**సుందర్‌రావు** : ఈ కేస్ ఎవరిదో తెల్సా?

**కోటి** : కేస్ ఎవరిదైనా ఈ హాస్పిటల్ నాది, దీని మీద అప్పుతెచ్చిన వాడ్ని నేను.

**సుందర్‌రావు** : చావు దగ్గర పడింది.

**కోటి** : ఎవరికి? పేషెంట్‌కా!

**సుందర్‌రావు** : కాదు నీకు.

**కోటి** : ఏం!

**సుందర్‌రావు** : ఈ కేస్ డాక్టర్ ప్రసాదరావుది

**కోటి** : అమ్మో! ప్రసాదరావు గారిదా! ఆ మాటముందే చెప్పొచ్చుగా! మా పాలిట అతను మరో అప్పాజీ! ఇదిగో ఇంకే టెస్టులు అక్కర్లేదు – చేసుకున్నవి చాలు – థియేటర్‌లోకి వెళ్ళిపొండి – ఆపరేషన్ చేయించేసుకోండి! ఒరేయ్! ఈ హాస్పిటల్ ఇనాగరేషన్‌కి మంచి ముహూర్తమేపెట్టించావురా!

**సుందర్‌రావు** : ఇప్పుడెందుకొచ్చిందో డౌటు!

**కోటి** : ఇక్కడకు యమధర్మరాజుతో పోరాడి పేషంట్ల ప్రాణాలు తీసుకొచ్చే అప్పాజీలు, ప్రసాదరావులు తప్పా, మన బిజినెస్ గురించి ఆలోచించే ఒక్క డాక్టరూ రావడం లేదు. అందుకు.

**సుందర్‌రావు** : చూడు బావా! వృత్తిలో తృప్తి ఇంపార్టెంట్!

**కోటి** : అదొక్కటే తక్కువ. ఇంత పెద్ద బిల్డింగ్‌లో –ఆపరేషన్లు చేయించుకొని, ట్రీట్‌మెంట్లు తీసేసుకొని ఎవడిమటుకు వాడు ఊపుకొని వెళ్ళిపోతున్నారు. ఎవడ్ని కదిపినా నా ప్రాణాల్ని నిలబెట్టింది. డాక్టర్ అప్పాజీ, డా॥ ప్రసాద్‌రావులు, డా॥ జి.వి.ఎస్ అని వాళ్ళు పేర్లు చదువుతారు తప్పా ఒక్కడైనా ఈ డాక్టర్ కోటీ పేరు చెప్పారట్రా.

**సుందర్‌రావు** : దానికీ ఓ ట్రిక్కుంది బావా!

కోటి : ట్రిక్కా? ఏంటది?

సుందర్‌రావు : ఏంటంటే ఇప్పుడు డాక్టర్ ప్రసాదరావు ఉన్నారు అతను రోగాన్ని ఎలా నయం చేస్తారు?

కోటి : ఏవుంది. చిన్న చిన్న ఆసనాలు, ఎక్సర్‌సైజులు, ఫిజియోథెరపీ.

సుందర్‌రావు : అవసరమైతే తప్ప ఈ టెస్టులు, ఆపరేషన్‌కి వెళ్ళడు కదా!

కోటి : అవును

సుందర్‌రావు : అదే అప్పాజీ అయితే

కోటి : అబ్బో ఆయన మహిమంతా మాటల్లోనే వుంది –

సుందర్‌రావు : కదా! నువ్వు కూడా పేషెంట్ దగ్గరకు వెళ్ళి మంచి మంచి మాటలు చెప్పావనుకో! వాళ్ళ మనసు దోచుకున్నట్టు మాట్లాడావనుకో ఆ గొప్ప గొప్ప వాళ్ళ లిస్ట్‌లో నువ్వు చేరిపోతావ్.

కోటి : అంతేనంటావా!

సుందర్‌రావు : అంతే డాక్టర్ బావా!

కోటి : అయితే ఇప్పుడే పేషెంట్‌కి ఆపరేషన్‌కి వెళ్ళేముందు నాలుగు మంచి మాటలు చెప్తా.

సుందర్‌రావు : చెప్పిచూడు! అదిగో స్ట్రెచర్ వస్తోంది వెళ్ళు ముందుకు.

కోటి : ఏం చెప్పమంటావు?

సుందర్‌రావు : ఏదో ఒకటి అప్పాజీ గారు చెప్పినవి చాలా విన్నావుగా! అందులో ఏదో ఒకటి గుర్తు చేసుకొని చెప్పెయ్.

కోటి : అలాగే! (స్ట్రెచర్ తోసుకుంటూ వచ్చారు – ఆ వెనక పేషెంట్ తాలూకువాళ్ళు ఉన్నారు)

**పేషెంట్ బంధువులు** : ఒరేయ్ కాస్త ఓర్చుకోరా! డాక్టర్ గారు వస్తున్నారు. ఆపరేషన్ చేసేస్తారు

కోటి : ఎందుకయ్యా బాధపడతారు? ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదు – ఇదొక నాటకరంగం, ఇందులో మనమంతా పాత్రధారులం. పుట్టడం, పెరగడం, గిట్టడం ఇవన్నీ చాలా సహజమైన విషయాలు. శ్మశానం అంటే ఏంటీ? దాన్ని చూసి మనం భయపడక్కర్లేదు – అదొక పెద్ద గ్రీన్ రూమ్ లాంటిది. మనం చనిపోయాక మనల్ని శ్మశానానికి తీసుకెళ్తారు. ఎందుకు? మీకు తెలీదు కదా? నాకు తెలుసు, శ్మశానంకి వెళ్ళేది మేకప్ మార్చుకోడానికి.

**బంధువు** : ఏంటీ? మేకప్ మార్చుకోవడానికా!

**కోటి** : అవును. ఆపరేషన్ థియేటర్ ఒక చిన్న గ్రీన్ రూం లాంటిది. ఇక్కడ కూడా, చిన్న చిన్న మేకప్‌లు మారుస్తుంటారు. అలాంటి గ్రీన్ రూంలోకి వెళ్తున్నందుకు ఆనందంగా ఫీలవ్వాలి. హ్యాపీగా ఉండాలి. ఎంత తొందరగా వెళ్తామా అని కోరుకోవాలి.

**బంధువులు** : (గొల్లుమన్నారు) ఓర్నాయినో! ఈ స్మశానమేంటి? ఈ గ్రీన్ రూం ఏంటి?

**కోటి** : ఏడవకూడదయ్యా! అక్కడికెళ్తున్నవారిని ఆనందంగా సాగనంపాలిగానీ ఇలా ఏడుపులు, పెడబొబ్బలు పెట్టకూడదు.

**బంధువులు** : నాయనా! వెళ్ళిపోతున్నావా

**కోటి** : ఛఛ! ఏంటీ న్యూసెన్సు! ఛండాలంగా. నాలుగుమంచి మాటలు చెబుతుంటే ఆనందించకుండా ఏడుస్తారేంటీ అసహ్యంగా!

**బంధువు** : ఏంట్రా ఆనందించేది? ఆపరేషన్‌కి వెళ్తున్న పేషంట్‌ని పట్టుకొని శ్మశానంకి వెళ్తున్నావని అంటావా? పైగా ఆనందంగా వెళ్ళాలని అంటావా! పదండి పోదాం – ఈ హాస్పిటల్ వద్దు – ఆ ఆపరేషన్ వద్దు పదండి. (వెళ్ళబోతుండగా డాక్టర్ ప్రసాదరావు వచ్చాడు)

**డా॥ ప్రసాదరావు** : ఏమైందండీ? ఎందుకు వెళ్ళిపోతున్నారు

**బంధువు** : మీ మీద గౌరవంతో ఇక్కడ అన్ని వసతులున్నాయంటే వచ్చామండీ! ఇతని ప్రవర్తన ఏమీ బాగులేదు సార్.

**డా॥ ప్రసాదరావు** : అవసరమున్నా లేకపోయినా టెస్టులు చేయించుకోమంటున్నాడా?

**సుందర్‌రావు** : అలా అన్నా చేయించుకొనేవాళ్ళం ఏకంగా మనుషులు పోయే మాటలే చెబుతుంటేను. శ్మశానం అంటే పెద్ద గ్రీన్ రూం అంటండీ? ఆపరేషన్ థియేటర్ అంటే చిన్న గ్రీన్ రూం అంట.

**డా॥ ప్రసాదరావు** : ఏంటండీ ఇది? డబ్బు పిచ్చితోపాటు ఈ పిచ్చి కూడా పట్టుకుందా మీకు.

**సుందర్‌రావు** : ఏంటోసార్! ఈ మధ్య మా బావకు ఈ సంధిప్రేలాపనలు ఎక్కువైపోతున్నాయి.

**కోటి** : ఒరేయ్ నువ్వే కదా ధైర్యం చెప్పమన్నావు.

**సుందర్‌రావు** : అవును డాక్టర్ గారు! ఆపరేషన్ థియేటర్‌కి వెళ్ళే ముందు బిల్ గురించి మీరు ఆలోచించకండి. నేను బిల్ తీసుకోవాలి. అంటే

ఆపరేషన్ ముందు సక్సెస్ అవ్వాలి అదే నాకు కావల్సింది. ధైర్యంగా ఆపరేషన్ థియేటర్‌కి వెళ్ళండి అని చెప్పమన్నాను.

**కోటి** : ఒరేయ్ నాకు అలా చేస్తారా

**డా॥ ప్రసాదరావు** : ఇంక ఊర్కోండి! మాట్లాడింది చాలు – మీకేం భయంలేదు – ఆపరేషన్ థియేటర్‌లోకి రండి. (వాళ్ళను తీసుకొని డా॥ ప్రసాదరావు థియేటర్‌లోకి వెళ్ళిపోయాడు – వాళ్ళ వెనక సుందర్రావు నెమ్మదిగా జారుకోబోతుండగా అతని షర్టుపట్టుకొని కోటి ఆపాడు. వెంటబడి కొడుతుండగా, బయటినుండి డా॥ అప్పాజీ వచ్చారు. రెచ్చిపోయిన కోటి)

**కోటి** : వచ్చేసారా! మీరే రాలేదేమిటాని ఎదురుచూస్తున్నాను – లక్షలు లక్షలు అప్పులు తెచ్చి ఆసుపత్రి కట్టించాను కదా! రండి! పేదలకు, అనాథలకు, ముష్టివాళ్ళని అందర్ని ఇక్కడికి తీసుకొచ్చి రోగాల్ని మందులిచ్చెయ్యండి! ఆపరేషన్లు చేయించెయ్యండి? వాళ్లంతా దిమ్మస కొట్టిన దుక్కల్లా తిరుగుతుంటే హాస్పిటల్ కట్టించిన పాపానికి నేను పేషంటునైపోయి, ఇదే హాస్పిటల్లో జాయినై పోతాను వస్తాను – (వెళ్ళిపోయాడు)

**డా॥ అప్పాజీ** : ఏంటయ్యా! సుందరం ఎప్పుడూ లేంది, మీ బావ అంతలా ఇరిటేట్ అయిపోయాడు. ఇంట్లో ఏమైనా ఫైనాన్సియల్ ప్రాబ్లమా?

**సుందర్‌రావు** : ఏం లేదుసార్! మేమిచ్చిన కట్నం డబ్బుతోనే ఈ హాస్పిటల్ కట్టించాడు. ఎప్పుడు చూసినా బ్యాంక్ లోన్, బ్యాంక్ లోన్ అంటాడు. మీ పని మీరు కానివ్వండి. నేను కూడా ఈ హాస్పిటల్‌కి ట్రస్టీనే. (సుందర్రావు లోనకు వెళ్ళాడు. బయటి నుండి చిరంజీవులు గాబరాగా వచ్చాడు)

**చిరంజీవులు** : డాక్టర్‌గారూ! డాక్టర్‌గారూ!

**డా॥ అప్పాజీ** : ఏంటి చిరంజీవులు! ఏమయిందీ? ఏంటిలా ఆయాస పడుతున్నావు?

**చిరంజీవులు** : మిమ్మల్ని చివరిసారిగా చూసి పోదామని వచ్చానుసార్!

**డా॥ అప్పాజీ** : కూర్చో! ఏమైందయ్యా?

**చిరంజీవులు** : రేపో మాపో నాకు చావు తప్పదు.

**డా॥ అప్పాజీ** : ఏం జరిగిందో నిదానంగా చెప్పు?

**చిరంజీవులు** : మార్కండేయుని మనుష్యులు నాకోసం ఊరంతా గాలిస్తున్నారు.

మార్కండేయుని బాధ పడలేక భార్య బిడ్డల్ని తీసుకొని ఈ ఊరి నుండి వెళ్ళిపోవాలని అన్ని ఏర్పాట్లు చేసుకున్నాను అది వాడికెలా తెలిసిపోయిందో, నా ఇంటిచుట్టూ కాపలా పెట్టాడు. పోలీసులకు చెబితే వాళ్ళు పట్టించుకోవడం లేదు. ఇంటా బయటా నాకు రక్షణ లేకుండా పోయింది. వాడు చంపి తీరతాడ సార్.

**డా॥ అప్పాజీ** : చిరంజీవులూ! మొలకు కత్తికట్టుకొని తిరిగేవాడు ఆ కత్తికే బలికావాల్సి వస్తుందని ఎన్నోసార్లు చెప్పాను. అతనితో సఖ్యత కుదుర్చుకోమని బ్రతిమాలాను. చెవినేసుకున్నావు కాదు. ఇప్పుడు చూడు ఏమైందో.

**చిరంజీవులు** : నిజమే సార్. ఇప్పుడు సమయం మించిపోయింది. పరిస్థితి నా చెయ్యి జారిపోయింది.

**డా॥ అప్పాజీ** : అయితే ఇప్పుడేంచేద్దాం!

**చిరంజీవులు** : ఏదో విధంగా వాళ్ళ కళ్ళు గప్పి ఊరు దాటిపోవడానికి ప్రయత్నిస్తాను. నేను అక్కడ నుండి ఫోన్ చేస్తాను. నా భార్య పిల్లల్ని అక్కడకు చేర్చండి. ఒకవేళ వాళ్ళకు నేను దొరికిపోతే నా కుటుంబాన్ని ఆదుకోండి. డాక్టర్ గారు ఆ మాట చెప్పి వెళ్దామనే వచ్చాను. వస్తాను సార్. (బయటకు పరుగెత్తబోయి ద్వారం దగ్గర ఆగిపోయాడు) సార్! తప్పించుకొనే అవకాశం కూడా లేదు.

**డా॥ అప్పాజీ** : ఏం! ఏమైందీ?

**చిరంజీవులు** : మార్కండేయులు తన మనుష్యుల్తో హాస్పిటల్‌కే వస్తున్నాడుసార్! సార్! ఒకపని చెయ్యండి సార్, వాడి చేతుల్లో కన్నా మీ చేతుల్లో చావడం మంచిది. ఏదైనా విషం ఇచ్చి చంపెయ్యండి సార్! ప్లీజ్ సార్! ఏదైనా ఇంజక్షన్ ఇచ్చి చంపెయ్యండి సార్! (బయట మార్కండేయులు తన అనుచరులతో చిరంజీవులు గురించి వాకబు చేస్తూ వస్తున్నాడు.)

**మార్కండేయులు** : ఒరేయ్! గదులన్నీ జాగ్రత్తగా వెతకండి! నన్ను అడగాల్సిన పనిలేదు. కనబడితే కట్ చేసెయ్యండి.

**డా॥ అప్పాజీ** : (డోర్ వరకూ వెళ్ళి చూసి గబగబా లోనకొచ్చాడు.) చిరంజీవులు! ఇదిగో స్ట్రెచర్ మీద పడుకో! నేను చెప్పేవరకూ ఇక్కడ నుండి రాకు.

**చిరంజీవులు** : అమ్మో! ఇక్కడ పడుకుంటే వాళ్ళకి దొరికిపోనా!

**డా॥ అప్పాజీ** : వచ్చేస్తున్నాడు. తొందరగా నువు పడుకో చెబుతాను. (పడుకున్నాడు – అతని తల మీద వరకు దుప్పటి కప్పాడు)

**మార్కండేయులు** : (ఎంటర్ అయ్యాడు) డాక్టర్ గారూ! నమస్తే సార్! నమస్తే!

**డాక్టర్ అప్పాజీ :** ఏమిటి సంగతి మార్కండేయుటు ఇప్పుడొచ్చావు?

**మార్కండేయులు :** అదే సార్! ఈ రోజు నా బ్లడ్, ఎక్స్‌రే రిపోర్ట్స్ వస్తాయన్నారుగా! అవి తీసుకెళ్దామని. అలాగే నాకు మాత్రలు కూడా కొత్తవి రాస్తానన్నారు కదా అందుకనే వచ్చా.

**డా॥ అప్పాజీ :** సరే నీ రిపోర్ట్స్ తీసుకొని వెళ్దువుగాని, సుందర్రావు .... (అని పిలిచాడు)

**మార్కండేయులు :** సార్! చాలా హ్యాపీగా ఉన్నాను.

**డా॥ అప్పాజీ :** ఎందుకో నాకూ చెప్పరాదు!

**మార్కండేయులు :** ఇక చిరంజీవులు లేడు – చచ్చాడు నా ఆగర్భ శత్రువు ఈ రోజు అంతం చేస్తాను అందుకే ఈ రోజు చాలా ఆనందంగా ఉంది.

**డా॥ అప్పాజీ :** (ఫట్‌మని కొట్టాడు) షటప్! ఒక మనిషిని చంపిస్తున్నందుకు ఇంతగా ఆనందపడిపోతున్నావంటే నువు మనిషివి కాదన్నమాట.

**మార్కండేయులు :** డాక్టర్‌గారు!

**డా॥ అప్పాజీ :** అవును. నువు రాక్షసుడివి. మృగానివి.

**మార్కండేయులు :** డాక్టరు గారూ!

**డా॥ అప్పాజీ :** ఈ సృష్టిలో పుట్టడం – చావడం అనేవే ధర్మాలు. చంపడం – చంపించడం – అనేవి నీలాంటి దుర్మార్గులు కనిపెట్టిన వక్రమార్గాలు. చిరంజీవుల్ని చంపించేస్తానని తెగ ఆనందపడిపోతున్నావే, ఒక్క విషయం గుర్తుపెట్టుకో! దేవుని ఉత్తర్వులు లేనిదే ఎవరి ఉసురు ఎవరూ తియ్యలేరు. చిరంజీవులు చావలేదు నేనే రక్షించాను. నేను ఈ రోజు రక్షించినా అతని చావు ఆగదు. మరో పదిహేను రోజుల్లో చచ్చిపోతాడు. అంతే తేడా! ఆ దేవుడే అతన్ని చంపుతున్నందుకు సంతోషించు.

**మార్కండేయులు :** అతనికి కేన్సర్. చాలా ఎడ్వాన్సుడు స్టేజిలో వుంది. ఇంకో పదిహేను, తప్పితే ఇరవై రోజులు, దట్సాల్! (అప్పటికే రిపోర్ట్సు తీసుకుని కోటి ఒకవైపు నుండి, బ్లడ్ ఉన్న బౌల్ తీసుకుని సుందర్రావు మరోపక్క నుండి వచ్చారు. కాస్సేపు అందరూ మౌనంగా ఉన్నారు – ఆ మౌనాన్ని ఛేదిస్తూ) (మార్కండేయులు షాక్ నుండి తేరుకున్నాడు.)

**మార్కండేయులు :** (చిన్నగా మొదలైన అతని నవ్వు పెద్దగా ఇంకాస్త పెద్దగా, ఇంకా పెద్దగా మారాలి) డాక్టర్! గాడ్ ఈజ్ దేర్! హీ ఈజ్ గ్రేట్! రియల్లీ హీ

ఈజ్ గ్రేట్! చూసారా! నా శత్రువుకి ఎలాంటి పనిష్మెంటు ఇచ్చాడో. హీ ఈజ్ గ్రేట్.

**డా॥ అప్పాజీ** : మరి ఆ పనిష్మెంటేదో నువ్వే ఇవ్వాలనుకున్నావు గదా! అంటే నువ్వు నిన్ను పుట్టించిన దేవుడు కన్నా గ్రేట్.

**మార్కండేయులు :** అఫ్‌కోర్స్! బతుకునివ్వడంలో దేవుడు గ్రేట్ అయితే నాకు ఎదురు తిరిగిన వాడి బ్రతుకు తియ్యడంలో నేను గ్రేట్. అయినా మీరు ఈ విషయం చెప్పిన తరువాత నా సంతోషం పోయింది డాక్టర్.

**డా॥ అప్పాజీ** : అంటే ఇప్పుడు దొరికితే చంపవా?

**మార్కండేయులు :** ఎందుకు చంపను డాక్టర్! చంపుతాను కానీ కసితో నా కళ్ళలోకి రోషంగా, సూటిగా చూసే చిరంజీవుల్ని చంపడంలో వున్న థ్రిల్ కేన్సర్ వ్యాధితో ముక్కుతూ, మూలుగుతూ ఉన్న వాడ్ని చంపితే వస్తుందా డాక్టర్!

**డా॥ అప్పాజీ** : చూడు చనిపోవడం శరీర ధర్మం చంపాలనుకోవడం మానసిక రోగం. కాబట్టే ఇక ఇతన్ని చంపాలనే ఆలోచన విరమించుకో!

**మార్కండేయులు :** చూద్దాం!

**డా॥ అప్పాజీ** : నామాట విను మార్కండేయులు. నెలరోజుల్లో ఎలాను చావబోతున్న వాడ్ని చంపి ఆ రక్తపు మరకల్ని నీ చేతులకు అంటించుకోకు. ఆ పాపాల్ని నువ్వు మూట కట్టుకోకు. అతని ఇంటిల్లిపాదీ నిన్ను, నీ కుటుంబాన్ని శపిస్తుంటే అది నీకు క్షేమకరమా ఆలోచించు... (రెండు చేతులెత్తి మొక్కాడు మార్కండేయు వెళ్ళిపోయాడు) (చిరంజీవులు అమాంతం వచ్చి డాక్టర్ కాళ్ళను చుట్టేశాడు)

**చిరంజీవులు** : మీ రుణం నేనెలా తీర్చుకోవాలి డాక్టర్! ధన గర్వంతో మాట పట్టింపుకు పోయి అవతలివాడి ప్రాణాలు తీసెయ్యడం చాలా సుళువు అనుకున్నాను. ఈరోజు నా ప్రాణాల మీదకి వచ్చేసరికి తెలిసింది సార్ ప్రాణాల మీద తీపంటే ఏంటో! డాక్టర్ గారు! నేను బ్రతకాలి. పిల్లా పాపలతో హాయిగా బ్రతకాలి. నేను బ్రతకడం కోసం ఏం చెయ్యమన్నా చేస్తాను. చెప్పండి సార్! (చిరంజీవులు డాక్టర్ పాదాల మీద పడిపోయాడు.)

**డాక్టర్** : ఇందులో నువ్వు ఋణపడిపోయిందేముంది చిరంజీవి. నీకు ఆయుష్షు ఉంది కాబట్టే భగవంతుడు నా చేత ఇలా చెప్పించాడు. అంతే.

**చిరంజీవులు** : కాదు డాక్టర్! కోటి రూపాయలు ఇస్తానన్నా మీరు అబద్ధం చెప్పరు. అలాంటిది నన్ను బ్రతికించడం కోసం అబద్దాన్ని చెప్పారు. నాకు దేవుడంటూ వేరేలేరు. నా పాలిట దేవుడు మీరే సార్!

**డాక్టర్** : చిరంజీవులు! ఎమోషన్ అవ్వకు, ఫ్రీగా, కూల్‌గా ఉండు ముందు. ప్లీజ్.

**చిరంజీవులు** : సార్! ఓ చిన్న గొడవగా మొదలైన మా శత్రుత్వం చిలికి చిలికి గాలివానగా మారింది. అతన్ని దెబ్బతీసిన ప్రతీసారీ, నాకు సంతోషంగా మారి అతన్ని ఏదో విధంగా నష్టపెడితేనే తప్ప నిద్ర పట్టని స్థితికి వచ్చింది.

**డాక్టర్** : మనుషుల్లో 90 శాతం హిస్టీరియా రోగులే. ఒకరికి పేరు కావాలనే హిస్టీరియా, మరొకరికి పదవి కావాలనే హిస్టీరియా. మరొకరికి అతిమంచిగా బతకాలని హిస్టీరియా. మీ ఇద్దరికీ ఓటమిని అంగీకరించలేని హిస్టీరియా.

**చిరంజీవులు** : నిజమే. కానీ ఆ నిజం తెలిసేసరికి ఒకర్నొకరం చంపుకొనే స్థాయికి చేరుకున్నాం. కానీ ప్రాణాల మీదకు వచ్చేసరికి తెల్సింది డాక్టర్ గారూ! చెప్పండిసార్! నేనేం చెయ్యాలో చెప్పండి! నేను బ్రతకాలి! పిల్లా పాపల్తో బతకాలి! నేను బతకడం కోసం ఏం చెయ్యమన్నా చేస్తాను. చెప్పండి సార్.

## మూడవ భాగం

(కవికాకి కడుపునొప్పితో బాధపడుతూ హాస్పిటల్‌కి వచ్చాడు. వెనుక అసిస్టెంట్ ఉన్నాడు.)

**కవి** : అమ్మా నొప్పి.... బాబోయ్ నొప్పి..... ఆ డాక్టర్‌ని తొందరగా పిలవరా!

**అసిస్టెంట్** : సార్ ఈ నొప్పి ఎందుకొచ్చిందో నా కర్థమైపోయింది సార్!

**కవి** : మరి త్వరగా చెప్పి తగలడు... అమ్మో!

**అసిస్టెంట్** : కవిత్వాన్ని మీరు బిడ్డగా భావిస్తారుకదా. ఆ బిడ్డ అడ్డం తిరిగిందేమో!

**కవి** : జోకులేసేటైమట్రా ఇది. డాక్టరెక్కడున్నారో చూడరాదు నొప్పి ఎక్కువై పోతుంది. బాబోయ్!

**అసిస్టెంట్** : డాక్టర్‌గారూ... డాక్టర్ గారూ... (డాక్టర్ కోటివచ్చాడు)

**కోటి** : ఏంటిసార్! ఏంటి ప్రాబ్లమ్

అసిస్టెంట్ : కడుపునొప్పిగా ఉందిసార్!

కోటి : సరే ఇలారా! పడుకో! (అసిస్టెంట్‌ని లాక్కుపోతున్నాడు)

కవి : నొప్పి నాకండి - వాడిక్కాదు

కోటి : నొప్పిమీకా?... మరి మీ కేంటి?

అసిస్టెంట్ : నాకేమీలేదండీ... నేనే పాపం చెయ్యలేదండీ

కవి : అంటే నేను పాపం చేసాననా నీ ఉద్దేశ్యం

అసిస్టెంట్ : అడ్డమైన కవితలు రాసి దేశం మీదకు వదలడం పాపం కాదా!

సుందర్‌రావు : (ఎంటరయ్యి, విని) ఏంటి మీరు కవులా? అయితే మీరు రావడం మా పుణ్యం

కవి : అబ్బా... మళ్ళీ వస్తుంది. చాలా ఎక్కువొస్తోంది

అసిస్టెంట్ : వొలికించండి రాసేస్తాను (పెన్ను సర్దుకుంటూ)

కవి : కవిత్వం కాదురా! కడుపునొప్పి

సుందర్‌రావు : అయ్యో మీంక్కువగా మాట్లాడకుండా ఇలా రండి. పడుకోండి

కవి : (పడుకున్నాడు) అలాగే... అలాగే

కోటి : (కాస్త పరీక్షించి అసిస్టెంట్‌ని పక్కకు లాక్కొచ్చాడు). బాగా ఉందా?

అసిస్టెంట్ : (డాక్టర్, కవి దగ్గర కెళ్ళాడు) నొప్పి బాగా లేకపోతే హాస్పిటల్ కెందుకొస్తాం.

సుందర్‌రావు : (అసిస్టెంట్ దగ్గర కొచ్చి) ఆయన నొప్పి గురించి ఎవరడిగారు. డబ్బు గురించి. డబ్బు బాగా ఇస్తాడా అని.

అసిస్టెంట్ : ఎంతైనా ఫర్వాలేదు (డాక్టర్ మళ్ళీ కవి దగ్గరకి వెళ్ళాడు) ఆకాయగూరల కవిత్వం కోసం రోజులు రోజులు వేలకు వేలు తగలేస్తాడు.

కోటి : (అసిస్టెంట్ దగ్గరకొచ్చి) మరీ అంత ఉంటే కేసు చాలా కాంప్లికేటెడ్‌గా ఉన్నట్లే (జేబులోంచి ఓ పెద్ద లిస్టు తీసి (కిందకు విసిరి) కడుపులో వస్తున్నది కడుపు నొప్పని కన్‌ఫామ్ చేసుకోవడానికి టెస్టుల లిస్టు. అన్నీ చేసుకోవాలి.

అసిస్టెంట్ : కడుపునొప్పి కోసం ఇన్ని టెస్టులు చేయించాలా.

కోటి : మరదే! అవగాహన లేకపోవడమంటే!

అసిస్టెంట్ : ఇందులో అవగాహన లేకపోవడమేంటో చెప్పండి. కడుపునొప్పి వస్తే కంటికి, పంటికి, కాలికి, వేలికి, మెడకి, మెదడుకి, ముక్కుకు, ముఖానికి ఎందుకండి టెస్టులు.

కోటి : అలా అడిగావు చెబుతాను - ఆయన కవి కదా

అసిస్టెంట్ : కాదని ఎవడైనా అనగలడా?

కోటి : అతని పేరేటి? ఆత్రేయ

అసిస్టెంట్ : ఛీ!ఛీ! అతని కాలిగోటికి కూడ ఈ కవికాకి సరిపోడు.

కోటి : ఆరుద్రా

అసి : అయ్యో! అయ్యో! అంత గొప్ప వ్యక్తితో ఇతన్ని పోల్చకండి.

కోటి : సిరివెన్నెలా?

అసిస్టెంట్ : మీకు నోరెలా వచ్చిందండీ ఈ ఛండాలుడ్ని. సిరివెన్నెలగారనడానికి

కోటి : సో భువన చంద్రా, చంద్రబోసా?

అసిస్టెంట్ : నన్ను మరీ హింస పెట్టకండి సార్ చెప్పేస్తాను. అతని అసలు పేరు. ఆంబోతు అప్పలరాజు. కలం పేరు కవికాకి.

కోటి : చూసారా ఇన్ని పేర్లు కాదని రూల్ అవుట్ చేసుకొన్నాక. అసలు పేరేమిటో కన్‌ఫార్మ్ అయింది. డైయగ్నోసిస్‌లో లేని జబ్బులు లేవని రూల్ అవుట్ చేసేస్తేనే ఉన్న జబ్బు ఉందని ఈజీగా కన్‌ఫార్మ్ చేసెయొచ్చు. పేషెంట్‌ని తీసుకెళ్ళి టెస్ట్‌లన్నీ చేయించు కొచ్చేయండి. కావాలంటే నువ్వు ఓ 20% కమీషన్ తీసుకో!

కవి : నాకిక్కడ ప్రాణాలు పోతుంటే మందివ్వడం మానేసి ఆమంతనాలేమిటి? (డా॥ అప్పాజీ వచ్చాడు) (స్ట్రెచర్ మీద ఉన్న కవికానిని, అసిస్టెంట్ చేతిలో ఉన్న కాగితం చూసి)

డా॥ అప్పాజీ : ఏమైంది ఇతనికి

అసిస్టెంట్ : కడుపునొప్పితో బాధపడుతున్నాడు సార్

డా॥ అప్పాజీ : ఆచేతిలో కాగితం ఏంటి? (అసిస్టెంట్ చేప్పేలోపు)

కోటి : (ఇంతలో చటుక్కున కోటి కల్పించుకుని) కవికాకి గారి కవిత్వం నన్ను చదవమని ఒకటే ఇబ్బంది పెడుతుంటే వద్దంటున్నాను. ఇంతలో తమరు వచ్చేసారు. (డాక్టర్ కోటి అప్పాజీ వైపు గుర్రుగా చూస్తున్నాడు)

**డా॥ అప్పాజీ** : (కవి దగ్గరకు వెళ్ళి) ఏం తిన్నావు.

**కవి** : ఏం తింటానండీ! నవలేదైనా మొదలుపెడదామని నాలుగు రోజుల నుండి నాటుకోళ్ళు తింటున్నానండి.

**డా॥ అప్పాజీ** : నవల రాయాలంటే నాటుకోళ్ళు తినాలా

**కవి** : అలా అని కాదు. అలంకారాలు పడాలని అడవి పంది మాంసం కూడా తిన్నానండీ!

**డా॥ అప్పాజీ** : చమత్కారమైన సమాసాలు పడాలంటే సీమ పంది మాంసం తినాలని మా పెద్దలు చెప్పారు.

**కవి** : మా పెద్దలు రోజూ పెడతారు కూడా.

**డా॥ అప్పాజీ** : అంటే అది కూడా తిన్నారా.

**అసిస్టెంట్** : ఐటమ్, ఐటమ్‌కి కొన్ని గంటలు గేప్ ఇత్తారండి!

**కవి** : నీకు జ్ఞాపక శక్తి తక్కువ ఫిష్ ఫ్రై తిన్నది గేప్‌లో కాదు. ఈవినింగ్ స్నాక్స్‌లాగా.

**అసిస్టెంట్** : కాదు ఈవినింగ్ తిన్నది మటన్ కట్‌లెట్స్

**కవి** : కాదు ఫిష్ ఫ్రై

**డా॥ అప్పాజీ** : ఆపండి! ఏంటిది కడుపా! చెత్తకుండీయా! కోడి, గొర్రె, చేప, పంది ఇలా ప్రతీదాన్ని తినేసి కడుపుని ఓ బరియల్ గ్రౌండ్‌గా మార్చేసారు. కడుపు నొప్పి రాక ఏం చేస్తుంది.

**కవి** : నేను తిన్నది నా కోసం కాదండి – కవిత్వం కోసం. ఈ మాత్రం తింటేనే కడుపు నొప్పి వచ్చేస్తుందా సార్?

**డా॥ అప్పాజీ** : చూడు ఆకులు తిన్న మేకలు కొండ లెక్కుతాయి – మాంసం తిన్న మనిషి మంచమెక్కుతాడు. పీకల వరకు మెక్కితే వచ్చేది కవిత్వం కాదు – కడుపు నొప్పే – లంఖణం పరమౌషదం అన్నారు – వెళ్ళి నాల్రోజులు తిండి మానేసి మంచినీళ్ళు తాగుతూ గడుపు – బాగైపోతుంది నీ కడుపు (కవి వెళ్ళిపోయాడు)

(ఇదంతా గమనిస్తున్న డా॥ కోటి ఒళ్ళుమండి పోయింది)

**కోటి** : ఏంటీ?పేషెంట్‌ని పంపించేసారు. మానవత్వంతో నాలుగు పైసలు సంపాదిద్దామంటే అడ్డం పడిపోతారేంటి. హాస్పిటల్ డెవలప్ కాకూడదని మీరంతా కంకణం కట్టుకున్నారా?

డా॥ అప్పాజీ : షటప్! వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రాణాలు కాపాడుకోడానికి ఆస్పత్రుల కొచ్చే రోగులను భయపెట్టి ఫీజ్ పేరు మీద టెస్టుల పేరు మీద వారి అసహాయతను దోచుకోవడం మానవత్వం అనిపించుకోదు. వ్యాపారం.

కోటి : ఫీజులు, టెస్టులకి డబ్బులు తీసుకోకపోతే ఈ హాస్పిటల్ మెయిన్‌టెయినెన్స్ ఎలా చెయ్యాలి.

అప్పా : ఫీజు తీసుకోవద్దని నేనడం లేదు. ఆ పేరుతో దోపిడీ చెయ్యొద్దంటున్నాను. నిండు నూరేళ్ళు బ్రతకమని ఆశీర్వదించే వేదమ్ ఆయుర్వేదం. మన ఆరోగ్య వ్యవస్థ చుట్టూ ఎందరో మహానుభావులు నిర్మించిన రక్షణ వలయం హోమియో అన్నా, యునాని అన్నా, అల్లోపతి అన్నా వాటితో వ్యాపారం చేసి రెండు చేతుల సంపాదిద్దాం అనుకోవడం అమానుషత్వం, నీచం కూడా.

కోటి : ఈ నీతులు నేను వినదల్చుకోలేదు. రేపటి నుండి ఈ హాస్పిటల్ మూసేసి ఏ గోడౌన్లగానో కళ్యాణమండపంగానో మార్చేస్తాను. అప్పుడు తెలుస్తుంది నా విలువ మీద అందరికీ (వెళతాడు)

మూర్తి : (చిరంజీవులని చూడడానికి మూర్తి వచ్చి) దురదృష్టం కాకపోతే మీకు కేన్సర్ ఏంటి? (మాట పెగిలింది కాదు)

చిరంజీవులు : మూర్తి నేను చెప్పేది విను. నాకు కేన్సర్ లేదు

మూర్తి : ఏంటిసార్

చిరంజీవులు : నిజమయ్యా! నాకే జబ్బు లేదు

మూర్తి : ఏదీ లేకపోతే మీరు హాస్పిటల్లో 15 రోజులు ఉండటమేంటి? ఊరంతా ఆ టాక్ ఏంటి? ఏంటి సార్ ఇదంతా!

చిరంజీవులు : ఏంజరిగిందంటే ఆ మార్కండేయుల చేతిలో నేను చావబోయే సమయానికి డా॥ అప్పాజీ నాకు కేన్సర్ అని అబద్ధం చెప్పి నన్ను బ్రతికించారు. (చెవిలో అంతా చెబుతున్నాడు)

మూర్తి : అలాగా. మరో ఇరవైరోజుల్లో మీరు చచ్చిపోతారని అప్పాజీగారు చెప్పారు. వాడు నమ్మాడు. ఇదంతా బాగానే ఉంది. ఇరవైరోజుల తర్వాత మీరు చచ్చిపోకపోతే.

చిరంజీవులు : మూర్తీ!

మూర్తి : అవున్సార్! కాస్త బాగా ఆలోచించండి. ఇప్పుడు మార్కండేయులు రోజులు లెక్కిస్తుంటాడు. ఇరవై రోజులు కాకపోతే ముప్పై. అదీ

కాకపోతే మరో పదిరోజులు ఆగుతాడు. ఆ తర్వాత మీరెప్పటికీ చావకపోతే మార్కండేయులకు ముందు విసుగొస్తుంది. ఆ తర్వాత కోపమొస్తుంది. ఆ తర్వాత కసి పెరుగుతుంది. అంతే ఇక ఆగడు. హాస్పిటల్‌కి వచ్చి కసి తీరా మిమ్మల్ని అబద్ధం చెప్పాడని అప్పాజీని కూడా చంపుతాడు.

**చిరంజీవులు** : ఇదేంటయ్యా! బతికానురా దేవుడా అని సంతోషిస్తుంటే మళ్లీ ఈ చావు కబురు చెప్పావు.

**మూర్తి** : ఎందుకు చెప్పానంటే మీ సంతోషం శాశ్వతం కావాలని.

**చిరంజీవులు** : అయితే ఏం చేద్దామంటావ్!

**మూర్తి** : ఓపన్జేద్దాం!

**చిర** : ఏంటది! ఇప్పుడే ఎక్కడికైనా పారిపోమంటావా?

**మూర్తి** : అనను. ఎందుకంటే పారిపోయి ప్రయోజనం నిల్లు.
(బాగా ఆలోచించి) ఫైనల్‌గా ఒకటే మార్గముంది.

**చిరంజీవులు** : తొందరగా చెప్పు. నాకు టెన్షన్ పెరిగిపోతుంది.

**మూర్తి** : ఈ తిప్పలన్నిటికీ కారణం మార్కండేయులే కదా

**చిరంజీవులు** : అవును.

**మూర్తి** : అతన్ని మనం లేపేస్తేనో!

**చిరంజీవులు** : మూర్తీ! మతుండే మాట్లాడుతున్నావా. అసలిది ఎలా సాధ్యం?

**మూర్తి** : ఈ చివరి రోజుల్లో ఒక్కసారి చూడాలని ఉంది అని మార్కండేయులకు అప్పాజీ ద్వారా కబురు పెడదాం. తేలిగ్గా నమ్ముతాడు. వస్తాడు.

**చిరంజీవులు** : వచ్చిన తర్వాత?

**మూర్తి** : గుడ్. ఇక నాకు వదిలేయండి. నేను పాయిజన్ తెస్తాను. టీయనో, కాఫీయనో తెచ్చి, అది కలిపి ఇస్తాను. తాగుతాడు. చస్తాడు.

**చిరంజీవులు** : అప్పాజీకి తెలిస్తే

**మూర్తి** : తెలిస్తే ఏమౌతాది

**చిర** : అలా చేసినందుకు ఇంక మన మొహం చూడడు

**మూర్తి** : చూడకపోతే ఏం చచ్చిపోతామా! హాయిగా మనం బతికి బయటపడితే శతృశేషం లేకుండా పోయాక అప్పాజీ ఎందుకు తిప్పాజీ ఎందుకు...

**చిరంజీవులు** : ఏంటోనయ్యా! ఇలా ఊహించడానికే అసహ్యంగా ఉంది.

**మూర్తి** : చెప్పడానికి నాకూ అసహ్యంగానే ఉంది. కానీ తప్పదు. ఎందుకంటే మీరు అర్థాంతరంగా చావడం బాధగా ఉంటుంది కాబట్టి... ఏంటీ ఇంకా ఆలోచిస్తున్నారు. సరే అనండి.

**చిరంజీవులు** : సరే నీ ఇష్టం.

**మూర్తి** : వస్తాను (మార్కండేయులు హాస్పిటల్‌కు వచ్చాడు)

**డా॥ అప్పాజీ** : రా! మార్కండేయులు! రా! ఇలా కూర్చో! (కళ్ళు తెరిచిచూసాడు)

నీ కోసమే ఈ మందులన్నీ తీసిపెట్టాను....

ఇప్పుడు వాడుతున్న మెడిసిన్స్‌తో పాటు ఇవి ఎగ్‌స్ట్రా వాడాలి.

**మార్కండేయులు :** మీ అభిమానాన్ని వెలకట్టలేము డాక్టర్ గారూ! కాస్త నీరసంగా ఉన్నామంటే చాలు మాకన్న మీరే ఎక్కువ కంగారు పడిపోయి హడావిడి చేసేస్తారు. ఏంటో డాక్టర్ గారూ! ఈ మధ్య రాత్రుళ్ళు సరిగ్గా నిద్ర పట్టడం లేదు. కన్నుమూసినా, తెరిసినా చిరంజీవులు ముఖమే కనిపిస్తుంది. చిరంజీవులు చనిపోయినట్టు, అతని శవం మీద పడి భార్యబిడ్డలు గుండెపగిలేలా ఏడుస్తున్నట్టు – ఇవే – ఇవే– కళ్ళముందు కదలాడుతున్నాయి. తట్టుకోలేకపోయాను. చిరంజీవుల్ని చంపాలనుకున్నది నేనేనా? నేను ఆ మార్కండేయుల్నేనా అని తెగ మథనపడ్డాను. నా భార్యతో చెప్పి నేను నేనేనా అని అడిగాను. ఇదే మీరండీ! ఎప్పటికీ ఇలాగే ఉండిపొండి 'ఆ మార్కండేయుల్ని' మళ్ళీ రానివ్వకండని బ్రతిమాలింది. ఉన్నపళంగా ఇద్దరం చిరంజీవులు ఇంటికెళ్ళాం. నుదటనింత బొట్టు పెట్టుకొని లక్ష్మీదేవిలా కళకళలాడుతున్న ఆమెను ఓ విధవలాగా ఊహించుకునేసరికి తట్టుకోలేక పోయాను తను బావురుమంటూ ఏడుస్తూ పసిపిల్లలు తండ్రి లేకుండా అయిపోవడానికి ఏ పాపం చేసాం చెప్పన్నా అని అడుగుతుంటే నాకు నోట మాట రాలేదు. ఆమె కంటనీరు తుడిచి మీ ఆయనకు ఏం కాదు అని చెప్పి వచ్చేసా. డాక్టర్‌గారూ! ఒకరి కంట నీరు తుడిస్తే కలిగే ఆనందం ఎంత ఆస్థి సంపాదించినా రాదని అర్థమైంది.

**డా॥ అప్పాజీ** : నిజమేనయ్యా, కక్ష, కోపం, పట్టు పురుగుల్లాంటివి. ఆకులా మనల్ని తిన్న తర్వాత ఆవేశమనేదారాన్ని బయటకు కక్కుతాయి. ఆ నిజాన్ని ఈ రోజు తెలుసుకున్నావు. చాలా సంతోషం మార్కండేయులు. వాల్మీకిలోంచి ఓ కవి ఉద్భవించినట్టు, వేమనలోంచి ఓ సంస్కర్త

పుట్టినట్టు ఈ రోజున నీలో ప్రేమమూర్తిని చూస్తున్నానయ్యా. నీలో చిగురించిన ఈ ప్రేమ శాశ్వతం కావాలి. అలా కూర్చో నీ టెస్ట్‌కి ఏర్పాటు చేయిస్తాను. సుందరం! (అంటూ వెళ్ళిపోయాడు)

**మార్కండేయులు :** ఒరేయ్ ఆ పళ్ళబుట్ట చిరంజీవులకు ఇచ్చిరండి

**మూర్తి :** చిరంజీవులు పట్ల మీకు కక్ష అనుకున్నాను. ప్రేమ కూడా ఉందన్న మాట

**మార్కండేయులు :** మీరలా అనుకోవడం సహజమే. ఎందుకంటే జీవితంలో ఇంతవరకు ఆయన వల్ల నేను విషాన్నే కక్కాను. కాని ఇప్పుడు తెలిసింది. ఎదుటవాళ్ళపై పెంచుకున్న ద్వేషం శత్రువుకన్నా ముందు మనకి ఎక్కువ హాని చేస్తుందని.

**చిరంజీవులు :** (జబ్బు నటిస్తూ వచ్చాడు) బాగున్నావా మార్కండేయులు!

**మార్కండేయులు :** నామాటకేంగానీ! నువ్వెలా ఉన్నావో చెప్పు!

**చిరంజీవులు :** నువ్వు నన్ను చూడ్డానికి వస్తున్నావని తెల్సి జబ్బు సగం తగ్గిపోయిందనుకో! ఇందాక మూర్తితో అన్నాను! మూర్తీ! మార్కండేయుల్ని ఒక్కసారి చూడాలనిపిస్తోందని! ఈ లోగా డాక్టర్ గారు చెప్పారు నువ్వొస్తున్నావని. ఏవైనా మందులు ఒంట్లోని జబ్బుని నయం చేస్తాయిగానీ మనసులోని బెంగని తీరుస్తాయా చెప్పు!

**మూర్తి :** సరేసార్! ఇద్దరూ అలా ముచ్చట్లు చెప్పుకోవడమేనా లేకపోతే కాస్త 'కాఫీ' లాంటిదేమైనా తాగుతారా (అంటూ ట్రే అక్కడ పెట్టి సైగ చేయడం మీ చేత్తోనే ఇస్తే కొత్తగా కలసిన స్నేహం కలకాలం అతని గుండెల్లో ఉండిపోతుంది. (చిరంజీవులు కప్పు తీసుకున్నాడు. చేయి గజగజ వణుకుతోంది) (డాక్టర్ వచ్చాడు)

**డాక్టర్ :** ఏంటి చేయి వణుకుతోంది.

**మార్కండేయులు :** ఆ డిసీజ్ మనిషిని బాగా వీక్ చేస్తుందని మీరే చెప్పారు కదా డాక్టర్ గారూ. (కాఫీ కప్పు తీసుకోబోయాడు)

**డాక్టర్ :** మార్కండేయులు! ఎమ్టీ స్టమక్‌తో వచ్చావుకదా టెస్ట్‌లకి రడీ చేసాను. వెళ్ళి టెస్ట్‌లు చేయించు. తర్వాత కాఫీ తాగుదువుగానీ!

**మార్కండేయులు :** (వెళ్ళబోతూ ఆగి) చిరంజీవులు! నీ చేతి కాఫీ వదలుకోను. మళ్ళీ వచ్చి తాగుతా! ఫ్లాస్కులో పోసి ఉంచు. (వెళ్ళిపోయాడు).

**డాక్టర్ :** (ఆ కాఫీ తాగుతాడు)

**చిరంజీవులు** : (వెంటనే వద్దని వారిస్తూ ఆ కాఫీ కప్పును కింద పడేస్తాడు). (నెమ్మదిగా చేసింది చెప్పాడు)

**డా॥ అప్పాజీ** : మూర్ఖుడా! ఎంత పన్జేసావురా! నీ కసలు బుద్ధి, జ్ఞానం ఉందట్రా! నీ మీదున్న కక్షనంతట్నీ మర్చిపోయి ప్రేమతో నిన్ను అక్కున చేర్చుకోవాలని అతనొస్తే, అతన్ని కడతేర్చాలని చూస్తావా? నిన్నసలు ఏంచేసినా పాపంలేదు.

**చిరంజీవులు** : ఏంటండీ! ఏంటండీ ఆయనకు నామీద కారిపోతున్న ప్రేమ. ఎప్పుడండీ ఆయనకు నన్ను అక్కున చేర్చుకోవాలనుకున్నది. ఇన్నాళ్ళు చంపుతాను, చంపుతాను అని ప్రతిజ్ఞలు చేసి ఇప్పుడేమో కేన్సరొచ్చి చావబోతుంటే, పళ్ళు పట్టుకొచ్చి పరామర్శిస్తాడా.

**మూర్తి** : మేము ఇచ్చిన విషంతో చచ్చాడనుకోండి! అప్పుడు మేమూ వెళ్తాం రెండు బుట్టల పూలు, నాలుగు తట్టల పళ్ళు పట్టుకొని.

**డాక్టర్** : షటప్ యూ రాస్కెల్. మధ్యలో మీలాంటి వాళ్ళవల్లే ప్రతి సమస్య ఓ రావణ కాష్ఠంగా మారుతోంది. చూడూ! నీకు చాతనైతే రగులుతున్న చిచ్చును ఆర్పడానికి ప్రయత్నం చేయి. అంతే కానీ దానికి ఆజ్యంపోసి మంటను మరింత పెద్దది చెయ్యకు. గెట్‌లాస్ట్ ఫ్రమ్ హియర్! (మూర్తి వెళ్ళిపోయాడు)

**చిరంజీవులు** : ఇన్నాళ్ళు ఆ మార్కండేయుల్ని, నన్ను సరిసమానంగా చూస్తున్నారని అనుకున్నాను. కాని కాదు. ఆ మార్కండేయులంటేనే మీకు ప్రేమ, అభిమానం.

**డాక్టర్** : చిరంజీవులు

**చిరంజీవులు** : చెప్పండి డాక్టర్‌గారూ, నిజంగా మా ఇద్దర్ని ఒక లాగే మీరు అభిమానిస్తే, నన్ను మనస్ఫూర్తిగా ఆ మార్కండేయులు బారి నుండి రక్షిద్దామనుకుంటే, నాకు కేన్సర్ లేదనే నిజం ఎప్పటికైనా తెలుస్తుంది. నన్ను చంపుతాడు. అందుకే నేను వాడ్ని చంపేద్దామనుకున్నా, కానీ కుదరలేదు. మీరు ఒప్పుకోవడం లేదు. నన్ను ఇక తను పూర్తిగా మర్చిపోయేటట్టు చేయండి లేదా అతని చేతిలో నేను చావకుండా కాపాడండి డాక్టర్‌గారూ!

**అప్పాజీ** : అతని చేతిలో నువ్వు చావవు!

**చిరంజీవులు** : చస్తాను. నాకు కేన్సర్ లేదని తెల్సిన వెంటనే నన్ను చంపుతాడు.

అప్పాజీ : చంపలేదు. ఎందుకంటే నీకుందని చెప్పిన కేన్సర్ అతనికుంది. చాలా అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ఉంది. అబద్ధమాడి అతని జబ్బు నీ కంటగట్టి నిన్ను రక్షించాను.

చిరంజీవులు : డాక్టర్‌గారూ!

డా॥ అప్పాజీ : అవును! మందుల్లేని అతని వ్యాధిని ఎలాగూ బాగు చేయలేను. అతన్ని రక్షించలేను. అందుకే ఓ అబద్ధంతో అతని ఆవేశానికి అడ్డుకట్ట వేసాను. ఇదంతా ఎందుకు చేసానో తెల్సా! అతనిది ఓటమిని అంగీకరించే స్వభావం కాదు. తనే చనిపోతున్నానని తెలిస్తే నిన్ను చంపకుండా వదిలిపెట్టడు. బతకలేని అతన్ని బతుకుతావని అబద్ధం చెప్పి ఆ బతుకు నీకిచ్చాను. నీకు ఆయుష్షు పోశాను. ఈ విషయంలో నేనెంత పాపం చేసానో తెల్సా? ఆయనతో పాటు ఆఖరికి ఆయన భార్యాబిడ్డలకు కూడా అతని జబ్బు విషయం ఇప్పటికీ చెప్పలేదయ్యా!

చిరంజీవులు : డాక్టర్‌గారూ! మార్కండేయులు దగ్గరకు వెళ్దాంపదండి

అప్పాజీ : ఎందుకూ

చిరంజీవులు : అతని పాదాలమీద పడి క్షమాపణ చెప్పుకోడానికి, నాకు బ్రతుకు నిచ్చిన నా మిత్రుణ్ణి మనసారా కౌగిలించుకోవడానికి. డాక్టర్ ప్లీజ్! నన్ను అతని దగ్గరకు తీసుకువెళ్ళండి. అతన్ని నేను వెంటనే చూడాలి డాక్టర్

డాక్టర్ : ఆగు! ఈ విషయం అతనికెప్పటికీ చెప్పకూడదు

చిరంజీవులు : చెప్పను డాక్టర్! ఎప్పటికీ చెప్పలేను డాక్టర్! నాకు జీవితాన్నిచ్చిన వ్యక్తికి నీకు జీవితమే లేదని ఎవరైనా ఎలా చెప్పగలరు డాక్టర్! కానీ మార్కండేయులు బతకాలి! ఎంత ఖర్చయినా నేను భరిస్తాను. నా ఆస్థి అంతా అమ్మేయమన్నా అమ్మేస్తాను. అతను భార్య బిడ్డలతో హాయిగా, కలకాలం బతకాలి డాక్టర్. బతికించండి! బతికించండి డాక్టర్ గారు (చివరి మాటలు అంటుండగా మార్కండేయులు వచ్చాడు)

మార్కండేయులు : చిరంజీవులు! ఎందుకంత బాధపడతావు. నువ్వు తప్పకుండా బ్రతుకుతావు. (అమాంతం కౌగిలించుకున్నాడు)

చిరంజీవులు : మార్కండేయులు! (అతని గుండెలోకి చొచ్చుకుపోయాడు)

మార్కండేయులు : ఎందుకు చిరంజీవులు. అంత బాధపడతావు. నీకేం కాదు – నీకు తప్పకుండా నయమౌతుంది. నీకు అండగా నేనున్నాను. నా దొక్క

రిక్వెస్ట్ డాక్టర్! ఏంచేస్తే చిరంజీవులు నిండు నూరేళ్ళు బ్రతుకుతారో చెప్పండి! ఏం చేస్తే నేను నా మిత్రునితో కలిసి ఈ ఊర్లో తిరగ్గలనో చెప్పండి! ఇతని ప్రాణాలు తీస్తానని ఎక్కడ శపథం చేశానో అక్కడే ఇతను నా ప్రాణ మిత్రుడని లోకానికంత వినబడేట్లు చెప్పాలి. అందుకేమి చెయ్యాలో చెప్పండి డాక్టర్!

**చిరంజీవులు** : (స్వగతం) భగవంతుడా! ఎందుకయ్యా నాకింత శిక్షవేసావు. స్నేహం తాలూకా మాధుర్యాన్ని చవిచూపించి దాన్నింతలోనే నాకు దూరం చేసేస్తావా? నా ఆయుష్షులో సగం అతనికి పోసి మా స్నేహాన్ని మరికొంతకాలం నిలపలేవా? అతన్ని బ్రతికించలేవా! బ్రతికించలేవా!

**మార్కండేయులు** : డాక్టర్ గారూ! ఏదైనా మీరు చాలా ద్రోహం చేసారండీ! తను చనిపోతాడనే విషయం అతనికి చెప్పకుండా ఉండాల్సింది. అప్పుడు ఈ బతికినన్నాళ్ళూ హాయిగా ఈ క్షోభలేకుండా బతికేవాడు. చూడండి చావు భయంతో ఎలా కుంగిపోతున్నాడో! ఎంతగా భయపడుతున్నాడో!

**డా॥ అప్పాజీ** : చూడండీ! జీవితంలో ప్రతిమనిషికీ గాఢంగా ద్వేషించడానికి ఓ వ్యక్తి, ప్రేమించడానికి మరో వ్యక్తి కావాలి. కానీ అదృష్టమో, దురదృష్టమో రెండింటికి మీరు ఒక్కర్నే ఎన్నుకున్నారు. ఇట్స్ ఏ వండర్. యు ఆర్ గ్రేట్ ఎగ్జాంపుల్స్. అద్భుతమైన ఉదాహరణలు

**చిరంజీవులు** : మార్కండేయులు (అని అంటూ పట్టుకున్నాడు). జాగ్రత్త.

**మార్కండేయులు** : నువ్వు జాగ్రత్త! (ఇద్దరూ ఒకరికొకరు ఆనందంగా వార్డులోకి వెళ్ళారు)

**డా॥ అప్పాజీ** : భగవాన్! ఈ డెబ్భైఏళ్ళ వయసులో నేనెప్పుడూ ఏదీ నిన్ను అడగలేదు. ఇలా అడిగే అవసరం, అవకాశం వస్తుందని కూడా అనుకోలేదు. ఈ హాస్పిటల్లో, ఈ చేతులతో ఎంతో మందిని బాగు చేసాను. ఎంతో మందిని ఆరోగ్యవంతులుగా చేసి బయటకు పంపాను. కాని ఇతని జబ్బుని ఈ భూమ్మీదున్న ఏ ఎఫిషియంట్ డాక్టర్ బాగుచేయలేడు. ఏదో మిరకిల్ జరిగితే తప్ప! ఆ మిరకిల్ చేయగలది ఒక్కడే. అది నువ్వు – ఏదో మిరకిల్ చేసి గివ్ హిమ్ లైఫ్, గివ్ హిమ్ హెల్త్. ఎందుకింత ప్రాధేయపడుతున్నానో తెల్సా? వీరి జీవితం మిగిలినవారికి ఆదర్శం కావాలి. వీళ్ళు నేర్చుకున్న పాఠం లోకంలోని శత్రువులకు గుణపాఠం కావాలి. ప్లీజ్....డూ ఇట్... డూ ఇట్

లైట్స్ ఆఫ్ – లైట్స్ ఆన్

–పార్క్–

(కవి వచ్చాడు. వెనుక అసిస్టెంట్ ఉన్నాడు)

**అసిస్టెంట్** : వస్తుందా!

**కవి** : ఉహూ... ఇక్కడ రావడం లేదు... ఇంకోచోట చూడు...

**అసిస్టెంట్** : అన్ని చోట్లు అయిపోతున్నాయి. ఇంకే చోటు మిగిలిందని?

**కవి** : నాతో ఆర్గ్యుమెంట్ వద్దు. మూడ్ డిస్టర్బ్ అయిపోతాది. మూవ్ ఇంకోచోటకి మూవ్

**అసిస్టెంట్** : మీ వెనక తిరిగి తిరిగి కాళ్ళు అరిగిపోతాయి. ఇప్పటికొక్క కవిత్వం.. ముక్క అయినా రాసారా చెప్పండి. నేను ఏ జన్మలో ఏ పాపం చేసాను సార్!

**కవి** : నోర్మూసుకుని రా!

**అసిస్టెంట్** : వస్తాను సార్! మలబద్ధకం ఉన్న వాడెనక చెంబుపట్టుకొని వెళ్ళేవాడిలాగుంది నా పరిస్థితి.

**కవి** : ఒరేయ్! వస్తోంది.. ఆం! ఆం! వస్తోంది

**అసిస్టెంట్** : రడీగా ఉన్నాను. వొలికించు

**కవి** : దగ్గర పడింది.. అలాగే ముందుకు పద

**అసిస్టెంట్** : వస్తున్నాను... (వాకర్స్ నడుస్తున్నారు. స్థూలకాయుడు, అతని వెనక డాక్టర్ కోటి పరిగెత్తుకుంటూ వచ్చారు)

**స్థూల** : డాక్టర్ గారూ! డాక్టర్ గారూ!

**కోటి** : ఏంటీ? ఒళ్ళేమైనా తగ్గిందా?

**స్థూల** : ఈ మాత్రం కూడా తగ్గలేదు

**కోటి** : (టేప్ తీసి కొలిచాడు) ఇదేంటి? ఉన్నది తగ్గలేదు సరికదా పొట్ట ఇంకో పది అంగుళాలు పెరిగిందేమిటి?

**స్థూల** : అదే నాకూ అర్థం కావట్లేదు డాక్టర్!

**కోటి** : నేను చెప్పినట్లే చేసావా?

**స్థూల** : అన్నీ మీరు చెప్పినట్టే చేసాను. ఫుడ్ కూడా మీరు చెప్పినట్టే తిన్నాను సార్.

**కోతి** : రాత్రి ఏం తింటున్నావు?

**స్థూల** : పగలు తిన్నదాంట్లో సగం తింటున్నాను

**కోటి** : పగలేం తింటున్నావు?

స్థూల : ఏం తింటాను సార్. అన్నీ పచ్చివే తిన్నాను.

కోటి : అలాగైతే ఈపాటికి పూర్తిగా తగ్గిపోవాలే! నిజంగా పచ్చివే తిన్నావా?

స్థూల : అమ్మమీద ఒట్టు! ఆఖరకు మటన్, చికెన్ కూడా పచ్చివే తిన్నాను సార్!

కోటి : ఏంటి మటన్, చికెన్ కూడా పచ్చివే తిన్నావా?

స్థూల : మరి మీరు చెప్పిందానికి ఎగెనెస్ట్‌గా చేస్తానేంటి సార్! ఒక కప్పు అన్నం తినమన్నారు కదా సార్!

కోటి : అవును

స్థూల : అందుకే ఇంత కప్పుతో ఒక కప్పు అన్నం లంచ్‌కి తిన్నాను సార్! దాంట్లో సగం రాత్రి డిన్నర్‌కి తిన్నాను సార్. అయినా ఒళ్ళు తగ్గలేదు. ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు.

కోటి : ఓ పన్జెయ్యి! ఈ పార్కులో కూర్చొని ఈ చెట్లనీ, మట్టినీ, రాళ్ళనీ రప్పల్ని తింటూ ఇక్కడే జీవితాంతం పరిగెత్తుతూ ఉండు. ఇదిగో నాయినా హిమాలయ పర్వతాన్ని కరిగించవచ్చు. సప్తసముద్రాలు ఇంకిపోవచ్చు. కానీ నీ ఒళ్ళు మాత్రం తగ్గదు. దాంట్లోని కొవ్వు కరగదు. ఫో... ఫో... నిన్ను ట్రీట్ చేయడం నా వల్ల కాదు.

స్థూల : నీవల్ల కాదని నా కర్థం అయ్యిందిగాని నేను అప్పాజీ గారి దగ్గరికి వెళతాను (తలో దిక్కు వెళ్ళిపోయారు) (కవికాకి వచ్చాడు -అతని వెనకే - అసిస్టెంట్ వచ్చాడు.)

కవికాకి : ఎంతటి అద్భుతమైన దృశ్యం

అసిస్టెంట్ : ఏంటీ ఉదయిస్తున్న సూర్యుడా?

కవి : కాదు

అసిస్టెంట్ : కురుస్తున్న పొగమంచా

కవి : కానే కాదు

అసిస్టెంట్ : చల్లని పిల్లగాలులకు పరవశిస్తూ తల ఊపుతున్న వృక్షరాజములా!

కవి : ఏంట్రోయ్! నేను చెప్పాల్సిన కవిత్వం నువు చెబుతున్నావ్!

అసిస్టెంట్ : మీరెప్పటికీ చెప్పకపోతేను కాగితాలు ఖాళీగా ఉన్నాయని నేనే మొదలెట్టా!

కవి : చెప్తానురా! ఇప్పుడు చెప్తాను

**అసిస్టెంట్** : అయితే తినండి ఒకటి, చెప్పండి రెండు కవితలు

**కవి** : ఛీ (అని అది విసిరేసి) ఇన్నాళ్ళకు తెలిసింది కడుపు నిండితే కవిత్వం రాదు. మనసునిండితే తనువు ఉప్పొంగితేనే వస్తుంది కవిత్వమని.

**కవి** : మనిషీ!
విద్వేషవిషాన్ని మ్రింగేసి నువ్వొక గరళ కంఠడివైతే
ప్రేమనిండిన మనసులతో నువ్వొక సరళ హృదయుడివైతే
ప్రతీ అణువు పరమాత్ముని స్వరూపమే
ప్రతీ అంగుళం జీవాత్మకు నివాసమే
స్నేహకాంక్ష ప్రతిమదిలోను రగలాలి
రగిలితే పాము ఎంచుకున్న నివాసం
అవ్వదా ముంగిసకు ఆవాసం
మేకా పులినడవదా ప్రక్కపక్కన
అప్పుడు
శాంతి కామనలే కదా ప్రతిదిక్కున

**అసిస్టెంట్** : ఓహో! ఎంత అద్భుతమైన కవిత్వం చెప్పారండీ. మిమ్మల్ని ఇంతగా ఇన్‌స్పైర్ చేసిన లొకేషన్ ఏదండీ!

**కవి** : నన్ను ఇంతగా ఇన్‌స్పైర్ చేసినది లొకేషన్ కాదురా

**అసిస్టెంట్** : మరి

**కవి** : అదిగో! ఆ మార్కండేయుల, చిరంజీవుల మైత్రీ బంధమే నా చేత ఈ కవిత్వాన్ని చెప్పించింది. అలా చూడరా వాళ్ళెలా నడిచి వెళ్తున్నారో

(ఓ ప్రక్క నుండి డాక్టర్ అప్పాజీ వచ్చాడు)

**ప్రయోక్త** : చావు పుట్టుకలు మనచేతుల్లో లేవు - కానీ మనం బతకడం - మిగిలిన వారిని మనతో పాటు బతికించడం మన చేతుల్లో, మన ఆలోచనల్లో ఉంది.

(చిరంజీవులు, మార్కండేయులు వచ్చారు. అంతకు ముందు వాళ్ళు సవాలు విసురుకున్న స్థలాన్ని నిశితంగా చూసారు. ఇద్దరూ ముసిముసిగా నవ్వుకున్నారు)

**మార్కండేయులు** : (చిరంజీవుల్ని ముసుగేసి తీసుకెళ్ళిన స్థలం చూసి నవ్వుతున్నాడు)

**చిరంజీవులు** : (తనను పొడవబోయిన స్థలాన్ని చూసి నవ్వుతున్నాడు)

**మార్కండేయులు** : ఏంటి చిరంజీవులు! ఎందుకలా నవ్వుతున్నావు

**చిరంజీవులు** : ఏం లేదు... తల్చుకుంటే నవ్వాగడం లేదు. నువ్వెందుకు నవ్వుతున్నావు.

**మార్కండేయులు :** నా సంగతి సరే. నువ్వెందుకు నవ్వుతున్నావు?

**చిరంజీవులు** : నేను తర్వాత చెప్తాను... ముందు నువ్వెందుకు నవ్వుతున్నావో చెప్పు!

**మార్కండేయులు :** ఆ రోజు ఐదు రూపాయిల బిళ్ళ క్రిందపడేసి, దాని కోసం నువ్వు ఒంగితే ముసిగేసి మా వాళ్ళు నిన్ను తీసుకుపోయినారే అది తల్చుకుంటుంటే నవ్వాగడం లేదు. అప్పుడు నువ్వెలా కాళ్ళు కొట్టుకున్నావో తెల్సా? పీక్కోసిన కోడిలాగ గిలగిలా కొట్టుకున్నావు? అవును నువ్వెందుకు నవ్వుతున్నావ్.

**చిరంజీవులు** : నేనా! ఆ రోజు నువ్వు నన్ను కత్తితో పొడవబోయావు కదా! అప్పుడు నీ ముఖమెలా పెట్టావో తల్చుకుంటుంటే అబ్బా! నవ్వాగడం లేదు.

**మార్కండేయులు :** అప్పుడు నా ముఖమెలా ఉందో చెప్పవా?

**చిరంజీవులు** : ఉహూ... నేను చెప్పను... చెప్పను

**మార్కండేయులు :** ప్లీజ్ చిరంజీవులు చెప్పవా?

**చిరంజీవులు** : అచ్చం మేకల్ని నరికే కసాయివాడిలాగ. అప్పుడు నీ ముఖం చూడడానికి భయమేసి కళ్ళు గట్టిగా మూసేసుకున్నాను తెల్సా!

**మార్కండేయులు :** నా ముఖం చూడ్డానికి ఇప్పుడు కూడా భయమేస్తోందా!

**చిరంజీవులు** : ఛ! ఛ! ఇప్పుడు భయమెందుకు? నిజం చెప్పాలంటే నీ ముఖం చూస్తూ ఎంతకాలమైన బతికేయొచ్చనిపిస్తోంది.

**మార్క** : నాకైతే నీ ముఖం చూడకుండా ఒక్క క్షణం కూడా బతకడం కష్టం అనిపిస్తుంది.

**చిరంజీవులు** : మళ్ళీ జన్మంటూ ఉంటే ప్రేమ, అభిమానం తప్పా, ఆవేశం కక్ష కార్పణ్యం లేని దేశంలో పుట్టించమని ఆ దేవున్ని కోరుకుంటాను.

**మార్కండేయులు :** ప్రేమ అభిమానం తప్ప, ఆవేశం, కక్ష, కార్పణ్యం అన్నవి నా మనసులో పుట్టించొద్దని దేవుణ్ణి ప్రార్థిస్తాను.

**చిరంజీవులు** : ఇక నుండి మనం ఒక సంవత్సరం బ్రతికినా ఒక నెల బ్రతికినా, ఒక్క క్షణం బ్రతికినా – మనం నడిచిన బాట స్నేహానికి, ప్రేమకు రాచబాట కావాలి.

**చిరంజీవులు** : మన శరీరాలు రెండు అయినా మన ఆత్మలు ఒక్కటే. మనం వదలి వెళ్ళిన పాదముద్రలు శత్రు భావం వున్నవారి మనస్సుల్లో సంస్కరణ

ముద్రలు వెయ్యాలి. (ఇద్దరూ అటువైపు వెళ్ళారు. మరోప్రక్క నుండి కవి వచ్చాడు)

శత్రువనే మాట మనం కల్పించుకున్నదే తప్ప మనందరమూ మిత్రులమే. ఈ మైత్రీ అడుగుజాడల్లో ప్రతి మనిషి నడిచే దెప్పుడో. శతృభావాల్ని విడిచి పెట్టి స్నేహపు బాటలో ఈ మనిషి నడిచే దెప్పుడో? మనిషి మనిషిగా నడిచేదెప్పుడో?

**డా॥ అప్పాజీ** : చూడండి! అందరూ ఒక్కసారి వారివైపే కన్నార్పకుండా చూడండి! ఒక్కప్పుడు వారిద్దరూ ఒకరి ప్రాణాలొకరు తీసుకోవాలనుకున్నారు. ఇప్పుడు ఒకరికొకరు మరొకరు ప్రాణాలిచ్చుకోవడానికి సిద్ధపడుతున్నారు. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటి? అప్పుడు బ్రతుకు తామనే ధీమా! ఇప్పుడు చచ్చిపోతున్నాడనే బాధ బ్రతుకుతామంటే ద్వేషించి చంపుకొనేట్టు యత్నం చేస్తారా! చచ్చిపోతారంటే ప్రేమిస్తారా? మనిషిని మనిషిని ప్రేమించాలంటే అవతలి వాడు చచ్చిపోయే పరిస్థితిలో ఉండాలా? ఎంత దౌర్భాగ్యం! మనిషి చనిపోవాలంటే కాన్సర్ రానక్కర్లేదు. కాలమనే కాన్సర్ ప్రతిరోజూ, ప్రతిగంటా, ప్రతి క్షణము చంపుతూనే ఉంది. ఆ విషయం మనం చాలా కన్వీనియంట్‌గా ఎప్పటికప్పుడు మర్చిపోతున్నాం. కాబట్టే మన జీవితాల నిండా ఇన్ని కక్షలు, కుట్రలు ఆవేశాకావేషాలు. చావు పుట్టుకలు మన చేతుల్లో లేవు. కాని మనం బతకడం మిగిలిన వారిని మనతోపాటు బతికించడం మనచేత్తుల్లో, మన ఆలోచనల్లో ఉంది. "శత్రువు" అనే మాట మనం కల్పించుకున్నదే తప్ప మనందరం మిత్రులమే. నేనిక్కడ వందలు వేలు సంవత్సరాలు తిష్టవేసుకొని ఉండిపోను, నేను ఉండేది కొన్ని రోజులే అనే సత్యం మనం ప్రతిక్షణం గుర్తుంచుకుంటే, డెఫినెట్‌గా మనం ఇలా బ్రతకం. చాలా అద్భుతంగా, చాలా గ్రేట్‌గా, చాలా డీసెంట్‌గా డిగ్నిఫైడ్‌గా బ్రతుకుతాం. ప్లీజ్ ట్రై ఫర్ థట్! ఆల్ ది బెస్ట్!